2015 జూన్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...

| | | |
|---|---|---|
| సంపాదకీయం | | 02 |
| | ఎడిటర్ | |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| చేపల గాలం | మామయ్య కథలు | 09 |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| మధ్యకాలము | | 14 |
| | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | |
| ఇద్దరు స్నేహితుల కథ (సాక్ష్యము) | | 17 |
| | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | |
| నేపాల్ మిషన్ రిపోర్ట్ | | 19 |
| | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | |
| వస్త్రములు | | 21 |
| | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |

India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభి వందనములు.

ఈ సంవత్సరం ఎండలు విపరీతంగా మండి పోయినవి. అనేక మంది ఈ వడగాలులకు మరణించటము చాలా విచారకరము. దయచేసి ఆ కుటుంబముల ఓదార్పు కొరకు ప్రార్థించండి. మొత్తానికి దేశం చల్లబడినది. వర్షాకాలం మొదలయింది. కాని ప్రపంచ పరిస్థితి ఇంకా మండుతూనే వుంది. ప్రపంచ పరిస్థితి అటు ఉంచి మన రాష్ట్రం ఎంత భయంకరంగా ఉందో చూడండి. మనుష్యుల అవినీతి తారాస్థాయికి చేరుకుంది. నాయకులై ప్రజలను న్యాయముగా పాలించవలసినవారు ఎంత దుర్మార్గత ఒడికట్టుచున్నారో చూడండి. ప్రజలకు శాంతి, సమాధానాలు పంచవలసిన వారి యొక్క క్రియల వలన మన తెలుగు నాట (తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌ల్లో) సమాధానం లేకపోగా కక్షలు కార్పణ్యాలు విస్తరిస్తూ ఉన్నాయి. ఒకరి మీద ఒకరు బురద చల్లుకోవటం, కొట్లాటలు ఎక్కువైపోయాయి.

ఇక ధరలు ఎండల కంటే ఎక్కువగా మండిపోతున్నవి. ఎండల మంట తగ్గిపోయింది కాని ధరల మంట అంత కంతకు ఎక్కువై ప్రజలను కాల్చుకు తింటున్నవి. దీనికంతటకు ఏవో కారణాలు చెపుతారు కాని అసలు సంగతి ఏమంటే మనుష్యులకు దైవ భీతి లేక స్వార్థపరులై దోచుకుంటున్నారు. ఏ గవర్నమెంటు దీనిని కంట్రోలు చేయడం లేదు. దేవుడొక్కడే చేయగలడు. అయితే ప్రతి ఒక్కరు స్వార్థచింతన వదలి దేవుని వైపు తిరిగి ప్రార్థించటమే. క్రీస్తునందు విశ్వసించిన బిడ్డల ప్రార్థన దేవుడు ఖచ్చితంగా వింటాడు. సహాయము చేస్తాడు. నోవహు ఒక్క కుటుంబ ప్రార్థన ప్రపంచాన్ని రక్షించింది. దయచేసి క్రైస్తవులందరు కుటుంబ ప్రార్థనలు మొదలుపెట్టండి. ప్రపంచాన్ని రక్షించండి. ప్రతి విశ్వాసి మరొకరిని రక్షించండి.

క్రైస్తవ తలిదండ్రులు తమ యౌవన బిడ్డల గురించి ప్రార్థించండి. కాలము చాలా కొద్దిగా ఉన్నదని సాతానుడు తెలిసికొని తన మందీ మార్బలముతో ముందుగానే భూమి మీద దిగి ఉన్నాడు. ప్రార్థించండి.

–ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

15

– కొడవటికంటి

సౌలు ఆసక్తిగా చూస్తున్నాడు .సైఫను యొక్క కండ్లు ఆ సభలోనున్న సభ్యులను, ప్రజలను పరిశీలనగా చూస్తూ, ఎవరినో వెతుకు తున్నట్లు తిరుగుచున్నవి.

అవి సౌలు కండ్లని కలుసుకున్నవి. వాటిలో ఏదో సందేశం వుంది. అది అర్థం చేసుకొనే శక్తి, యోగ్యత తనకు లేవన్నట్లుగా అనిపించింది. ఎక్కడో ఇంతకముందు చాలా పరిచయమున్న స్వరము. బర్నబాతో సౌలును చూడక ముందే అతనిని ఎరిగిన కండ్లు, సైఫన్ తన కోసమే ఇంతవరకు వెదకినట్లుగా, ఇప్పుడు అతనికి తను దొరికినట్లుగా చూస్తున్నాడు. సైఫను కండ్లు తన కండ్లమీద నుండి వీడలేక కదలిపోయినట్లుగా కదలి, తన తర్వాత సభ్యుని మీదుగా, మధ్యలో సింహాసనాసీనుడైన కయప మీద నిలిచినప్పుడు సైఫను ఒక అడుగు పొడుగు సాగినట్లుగా, శరీరాకారం ఇంకొంచెం ఉబ్బినట్లుగా, ఇప్పుడు సైఫను ముఖం సగమే కనబడుతోంది. ఆ కన్ను ఎర్రగా అయినట్లుగా ఉంది.

“ముష్కరులారా!” అని అరచినట్లుగా గర్జన వినిపించింది. అది సైఫను చేసిన గర్జన అయినా సభలో ప్రతి ఒక్కరిమీద పిడుగులాగ పడింది.

సౌలు ఉలిక్కి పడ్డాడు. ప్రసంగం మొదట్లో కనిపించిన దేవదూత ఆకారం ఎంత తొందరగా మారిపోయిందో, ఇక్కడ సైఫను గొంతు అంత తొందరగా మారిపోయింది.

సైఫను సభ చుట్టూ వేగంగా కండ్లు త్రిప్పినప్పుడు అక్కడి వారికి ఎవరికి వాళ్ళకి తననే ముష్కరుడా! అని పిలిచినట్లుగా తోచింది.

“హృదయములను, చెవులను దేవుని వాక్యముకు లోపరచ నొల్లని వారలారా? మీ పితురులవలె మీరును ఎల్లప్పుడు పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నారు” అని ఆగాడు. మీ పితరులు ప్రవక్తలలో ఎవరిని హింసించక ఉండిరి?” అని ప్రశ్నించాడు. బదులు చెప్పండి? అన్నట్లుగా ఆగాడు.

సభలో ప్రతివ్యక్తి మంత్ర ముగ్ధులైనట్లు నిశ్శబ్దంగా వున్నారు. తీర్పు తీర్చటానికి వచ్చిన వారందరు ముద్దాయిల వలె మాన్పడిపోయారు.

“ఆ నీతిమంతుని రాకను గూర్చి ముందు తెలిపిన వారిని చంపిరి. ఆయనను మీరు ఇప్పుడు అప్పగించి హత్య చేసిన వారైతిరి” అన్నప్పుడు జనంలో మొదటిసారిగా నజరేయుడైన యేసు గురించి – అన్న మాటలు వినవచ్చి కయపగారి ముఖం కందగడ్డవలె అయింది.

చాలామంది అప్పటివరకు కూర్చున్నవారు – వారికి తెలియకుండానే లేచి నిలబడ్డారు. నిలబడి ఉన్నవారు ఒక్క అడుగు ముందుకు వేసారు.

“దేవదూతల ద్వారా నియమింపబడిన ధర్మశాస్త్రమును మీరు పొందితిరిగాని దానిని గైకొనలేదు” అని నిలబడి పోయాడు.

ఇప్పుడు సౌలు – సైఫను వైపు చూసాడు. ఇప్పుడు సైఫను మామూలుగానే ఉన్నాడు. అతనిలో భయం, విచారం ఏమీ లేవు. అసలు ఇంతవరకు అతను ఆ సభలో ఒక్కమాట కూడా మాట్లాడ లేదన్నట్లుగా నిలుచున్నాడు.అతను ఇంకా తన ప్రసంగం ముగించలేదు. ఇంకా ఏమి మాట్లాడతాడు? అతనిని శిక్షించటానికి సరైన మాటలు ఏవీ ఇంకా అతని నోటినుండి రాలేదు. అతణ్ణి సభ ఎదుటికి తీసుకొని వచ్చిన పదిమంది ముందుకు నడిచివస్తున్నారు. వారు పండ్లు కొరుకుతున్నారు. వారు దగ్గరికి వచ్చేకొలది సైఫనులో మార్పు వస్తుంది. తనని చంపటానికి వస్తున్న వారిని తన శక్తినంతా కూడదీసుకొని ఎదుర్కొంటున్న వానివలె వారిని చూసి ఇప్పుడు ఆకాశంవైపు తేరిచూస్తూ, తన రెండు చేతులు పైకెత్తుతున్నప్పుడు అతనిని కోపంగా సమీపిస్తున్న వారు ఒక్కక్షణం ఆగారు. సైఫన్ ఆకాశం వైపు ఎవరినో సంతోషంతో, ఆశ్చర్యంతో చూస్తున్నట్లుగా ముఖం పెట్టి –

“ఆకాశము తెరువబడుటయు, మనుష్యకుమారుడు దేవుని కుడిపార్శ్వమందు నిలచి ఉండటం చూస్తున్నాను” అన్నాడు.

అంతే! తర్వాత సైఫను సౌలు కంటికి కనిపించలేదు. ఒక్కసారిగా అమావాస్య కెరటం సముద్రం నుండి విరుచుకు పడినంత శబ్దం చేస్తూ జనం అరుస్తూ గుంపుగా కదిలారు. మధ్యలో సైఫను ఏ స్థితిలో ఉన్నాడో తెలియటం లేదు. కాని మొత్తానికి ఆ గుంపు పట్టణం వెలుపలికి అతనిని ఈడ్చుకొని పోవటం తెలుస్తూనే ఉంది. సౌలు లేచి నిలుచున్నాడు. అంతా ఒక కలలాగ తోచింది. అసలు సన్‌హెద్రిన్ సభ ముగించ లేదు, తీర్పు జరగలేదు. ఇంత దొమ్మి, అన్యాయం – ఒక్క వ్యక్తి–జనసమూహము–విచక్షణారహితము. యేసు శిష్యులు వేలలో ఉన్నారు. ఒక్కరైనా సైఫనుకి సహాయం రారెందుకు?

పెద్ద గోల. జన సమూహము కదులుతున్నారు. అరుపులు తను సన్‌హెద్రిన్ సభ్యుడైన తర్వాత మొదటి న్యాయస్థానము ఈ విధంగా ముగిసిందేంటి? తనయినా దీనిని ఆపవచ్చును కదా! కాని అది అసాధ్యము. ఈ జన సమూహమును ఒక్కమనిషి ఆపలేడు. ఇప్పుడు సైఫను మధ్యలో నిలబడి ఉన్నాడు. అతని చుట్టూ ఉన్న జనం అన్ని వైపుల నుండి అతని మీదకు రాళ్ళు వేసేందుకు అతని చుట్టూ దూరంగా గుండ్రంగా నిలబడి ఉన్నారు. సౌలు ఎత్తైన ఒక గుట్ట దగ్గర ఉన్న ఒక పెద్ద రాతిమీద కూర్చుంటే, అతనిని అనుసరించి వచ్చిన తనతోటి సభ్యుడు అతని ప్రక్కనే కూర్చున్నాడు.

గమలియేలుగారి ఇంటి దగ్గర తనతో మాట్లాడిన లిబర్తీయులలో నలుగురు, యెరూషలేము యూదులు నలుగురు సౌలు కూర్చున్న స్థలము వద్దకు వచ్చి మహాసభ సభ్యునికి చూపే మర్యాదతో నమస్కరించి, తమ పై వస్త్రములు తీసి సౌలు పాదాల దగ్గర పెట్టి, ప్రక్కనే తలా ఒకరాయి తీసుకొని సైఫను ఉన్న వైపుగా వెళ్ళారు. సౌలుకి సైఫను ఇప్పుడు బాగా కనబడుతున్నాడు. ఒక్కసారిగా లెక్కించలేనన్ని రాళ్ళు సైఫను మీదకు విసరబడ్డాయి. సైఫను నేలకు ఒరిగిపోతూ ఉంటే అతని చుట్టూ ఆ రాళ్ళు కుప్పలా పెరుగుతున్నాయి. సైఫను కొంచెం తేరుకున్నట్లుగా మోకరించి చిన్నగా రెండు చేతులు ఆకాశంవైపుగా ఎత్తి "యేసుప్రభూ! నా ఆత్మను చేర్చుకొనుము" అని అరిచాడు. మరలా అతనిమీద పడుతున్న రాళ్ళవర్షాన్ని ఆహ్వానిస్తున్నట్లు ఉండిపోయాడు.

సౌలు తన జీవితములో తనుగా లేని సంఘటన ఇది. ప్రతి చోట, ప్రతి స్థలములో తనమాట తన పలుకుబడి ప్రతిధ్వనించేది. ఇప్పుడు ఇక్కడ మూగవాడినై, బలహీనుడనై పోయాను అనుకున్నాడు తన పాదముల యొద్ద కుప్పగా ఉంచబడిన సాక్ష్యుల వస్త్రములు చూస్తే, ఈ వ్యక్తి యొక్క మరణముకు తనే కర్తగా, నాయకుడుగా అనిపిస్తుంది.

మరణం, హింస – ఈ రెండింటికి అతీతంగా ఇంత పెద్ద గుంపును, ఈ రాళ్ళ వర్షమును తన శరీరంమీదకి ఆహ్వానించిన ఈ వ్యక్తి – అతని పేరు సైఫను. ఇతని మూర్ఖత్వానికి కారణం ఆ నజరేయుడైన యేసు. ఇంతకు ముందు అతని మీద ఉండిన జాలి ఏదైనా ఉంటే, ఇప్పుడు అది ద్వేషంగా మారింది. ఇటువంటి మూర్ఖమైన సమూహము, వారి నాయకుని నామం, ఈ భూమి మీదే లేకుండా తుడిచి వేయాలి.......... ఔను!

ఈ కార్యం అంత చిన్నదేమీ కాదు. కారుచిచ్చులాగా, దావానలం లాగా వ్యాపిస్తున్నది. దీన్ని ఆర్పివేయటానికి ప్రధానయాజకులు మాత్రమేకాక అన్ని యూదా సమాజముల వారు తన ప్రక్కన ఉన్నారు. ఈ కార్యచరణాన్ని ఏ మాత్రం అలక్ష్యము చేయకూడదు. తను కోరుకొనక పోయినా, ఈ మహాసభ సభ్యత్వము వలన ఈ మారణహోమం, యేసునామమనే అగ్ని, దీనిని ఆర్పివేయటానికి తనను దేవుడు సరైన సమయంలో ఇక్కడకు నడిపించాడు.

మరలా పెద్ద గోల. గోలకాదు అది ఘోష, ఒక్క ఉదుటున ఆకాశం పైకి లేచింది. సౌలుయొక్క ఆలోచనలు ఆగి పోయాయి. జనసమూహం అంతా ఇప్పుడు పీఠము మీద పడిన జలములాగ అని ప్రక్కలకు విడిపోతున్నారు. ఇద్దరు వ్యక్తులు మాత్రం సైఫను యొక్క శరీరంవద్ద నిలబడి ఉన్నారు. ఒక వ్యక్తి వంగి అతని నాడి పరీక్షించి, పైకి లేపిన సైఫను చెయ్యి వదలినప్పుడు, నలిగిపోయిన 'చెట్టు' కాడలా అతని చెయ్యి నిదానంగా నేలకు దిగుతున్నది. నాడి పరీక్షించిన వ్యక్తి చేతినిండా రక్తం అంటుకుంది. సైఫనుయొక్క శరీరం ఇప్పుడు ఆకార రహితంగా ఉన్న ఎర్రని మాంసపు ముద్ద. అతని వెంట్రుకలు కూడా రక్తముతో నిండియున్నవి. అతను ఇంకా మరణించలేదు అని అర్థమవుతోంది. అతనికి

దూరంగా ఉన్న జనసమూహం ఇంకా దూరంగా నిలబడి చూస్తున్నారు. స్తెఫను కదులుతున్నాడు – అంటే ఏదో చెప్పాలని. తను చెప్పదలచు కొనినది చెప్పకుండా ప్రాణం వదలకూడదని నిశ్చయించుకొనిన వానివలె. ఇప్పుడు అతను తన చేతులను దగ్గరకు కూడదీసుకొంటున్నాడు.

కాళ్ళు కదులుతున్నాయి, సౌలు ఆశ్చర్యపోయాడు. అతని దగ్గరకి అతని వాళ్ళెవరూ రావటం లేదు. కనీసం అతనేమి చెప్పదలచుకున్నాడో తెలుసుకుందామని కూడా..... మర ణించే వాని ఆఖరి కోరిక... ఆఖరి స్వరం వినాలని కూడ ఎవరు ముందుకు రాలేదు. సౌలు లేచి నిలచి రెండు అడు గులు వేసి ఎత్తైన రాయిమీద నుంచి క్రిందకు దిగుతుంటే...

"ప్రభువా!" – అని గొప్ప స్వరం స్తెఫను యొక్క ముద్దగా మారిన శరీరంలో నుండి వచ్చింది. ఆ పిలుపు చాలా బలమైనది. ఎంతో శక్తి ఎక్కడనుంచో వచ్చి అతనిలో ప్రవేశించి మాట్లాడిస్తున్నట్లుగా ఉంది. తన శక్తినంతా కూడదీసుకొని మోకరించాలని చేసే ప్రయత్నం వ్యర్ధమయి పోయిందనే బాధ అతని ముఖంలో కనిపిస్తుంది. ఇప్పుడు ఎందుకు మోకరించటం? అతని అనేకమైన ఎముకలు విరిగిపోయి ఉండాలి. అతని తల, చేతులు మాత్రం కొంచెం పైకి లేచాయి. చేతులు రెండూ జోడించి "వారిమీద" అని అంటున్నప్పుడు రక్తముతో తడిపిన స్తెఫను కన్నులు సౌలువైపు చూస్తున్నట్లు ఉన్నాయి. సౌలు ఇప్పుడు స్తెఫనుకు చాలా దగ్గరలో ఉన్నాడు. స్తెఫను యొక్క కన్నులు తన కన్నులలోకి సూటిగా చూస్తున్నాయి.

"ఈ... పాపము... మో..ప..కు..ము.." అనిన శబ్దం బహు దీనంగా, భారంగా, యదార్ధంగా ఆ శరీరంలో నుండి బయటికి వచ్చింది. ఈ మాటలు అందరికంటే తనే స్పష్టంగా విన్నాడు. తనను గురించి స్తెఫను దేవునికి – కాదు తన యేసును ప్రార్ధిస్తున్నాడు అనుకున్నాడు.

'యేసు' అనే నామం సౌలు నోటినుండి రాగానే సౌలు యొక్క శరీరంలో ఏదో మార్పు వచ్చినట్లుగా భావించాడు. ఒక రకమైన ద్వేషం – అపవిత్రమైన వానిని ముట్టినట్లుగా, సమరయుని దగ్గర భోజనం చేసినట్లుగా భావించుకున్నాడు. అతని శరీరం గగుర్పాటు కలిగినట్లయింది. ఆ శవంవైపు చూచాడు. ఆకాశం వైపు కండ్లు తెరచుకొని చూస్తున్నాయి. చేతులు రెండు గుండెలమీద పడి ఉన్నవి. శరీరంలో అనేకచోట్ల నుండి రక్తం ఇంకా కారుతూనే ఉంది. అది ఇంకా గడ్డ కట్టలేదు. సౌలు వెనక్కి తిరిగాడు. ఆలోచిస్తూ ప్రధాన యాజకుడి ఇంటివైపు తిరిగాడు. దూరంగా ఆలయానికి ఆనుకొని ఉన్న 'ఆంటనియో' శిఖరం, పై అంతస్తులో నిలబడి వెండి బూరలు ఆకాశం వైపుకు ఎత్తి 'సాయంకాల దహనబలి నైవేద్యము ముగిసింది' అని చెప్పే యాజకుల బూరధ్వని వినబడింది. కాని ఆ బూరధ్వని తన జీవితంలో 'యెహోవా కొరకై రోషము గలవాడనై, యేసు శిష్యుల బలి కార్యక్రమ ముకు' మొదలు అనుకున్నాడు. స్తెఫను యొక్క మరణము తనకర్తవ్యాన్ని గుర్తుచేసింది. యేసు నామముకు వ్యతిరేకంగా తానెన్ని యోచనలు చేశాడో – ఇప్పుడు అన్నీ ఆచరణలో పెట్టాలి. సన్‌హెడ్రిన్ సభ వలన మరణశిక్ష విధించబడిన వాని శవమును, పరిశుద్ధ పట్టణపు సమాధులలో భూస్థాపితము చెయ్యరు. వారికోసం ఎవరును అంగలార్చరు. ఆ కారణం వలనే నజరేయుడైన యేసు – సిలువలో మరణించినప్పుడు అతని శిష్యులు ఎవరూ సిలువ యొద్దకు రాలేదు. ఆయన మరణించినప్పుడు కాపలా సైనికులు తప్ప ఒక్క పురుషుడు కూడ అక్కడ లేడని తెలిసింది.

రాజువంటి అరిమతయిగారు, మహా విద్వాంసుడైన నికోదేము గారు ఈ ఉచ్చులో ఎలా పడిపోయారో!? అని అనుకొంటూ పట్టణంలోకి ప్రవేశిస్తుంటే, నజరేయుడైన యేసు శిష్యులు, వారిలో 'హేయేలు' కూడ ఉన్నాడు. తనకు ఎదురుగా వచ్చారు కాని, వారు తనను గమనించలేదు. వారు బహు దుఃఖములో ఉన్నారు. అయితే పైకి శబ్దము కూడ రాకుండా నడుస్తున్నారు.

**(సశేషం)**

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

సీరియల్

# ఫాదర్ సర్గీస్

15

## (లియో టాల్‌స్టాయ్)

"సరే నీవెలాగైనా అనుకో. నేను ఓ భయంకరమైన జీవితం జీవించాను. ఇప్పుడు దేవుడు నన్ను శిక్షించాడు. నేను జీవించాలి. జీవిస్తాను. నిన్ను చూడాలనుకున్నాను. చూచాను. నన్ను నీవు క్షమిస్తే నన్ను ఇప్పుడు చూచినట్లుగా ఎవరికి తెలియనీయవద్దు" అని, మెల్లగా లేచి నిలుచు న్నాడు. బూట్లు తీసుకొని టోపి తల మీద పెట్టుకొని బయటకు వచ్చాడు. అప్పుడు చీకటిపడింది. ఆ చీకటిలో నడుస్తున్నాడు. కొన్నిచోట్ల కుక్కలు మొరుగు తున్నాయి. నేను మనుష్యుల కొరకు జీవించాను. అలాగున దేవుని సేవ చేస్తున్నాననుకున్నాను. ప్రశాంక దేవుని కొరకు జీవిస్తున్నాననుకొని మనుష్యుల వలన అనేక హింసలు బాధలు పడింది. ఏది ఏమైనా తను ఆమె దగ్గర కోరినది పొందలేదు. ఒక గ్లాసు చన్నీళ్ళు ఇచ్చింది. అది ఆమెకు ఎంతో ఆశీర్వాదము. మరి నేనేమి చేశాను? నా జీవితమంతా మనుష్యుల పొగడ్తల మధ్య ముగిసిపోయింది. ఇప్పుడు ఈ శేషజీవితం దేవుని కొరకు జీవించాలి అనుకుంటూ నడుస్తున్నాడు.

అలా నడుస్తూ గ్రామాలు పట్టణాలు దాటుతూ అవసరమైనపుడు ఆహారం అడుక్కుంటూ ఉన్నాడు. ఒక కోపిష్టి ఇల్లాలు తిట్టింది. ఒక త్రాగుబోతు రైతు కొట్ట బోయాడు. కాని రోజులు దొర్లిపోతున్నాయి. అవసరమైన చోట తన చేతిలోని క్రొత్తనిబంధనను కొంత చదివేవాడు. తగాదాలు తీర్చేవాడు. ప్రేమను ఇతరులకు పంచిపెట్టేవాడు. దయగా మాట్లాడేవాడు. ఇతరులకు దయ చూపేవాడు. కొంచెం కొంచెంగా దేవుడు తనను తాను అతనికి ప్రత్యక్షపరచుకోసాగాడు.

ఒక రహదారిలో కొందరు సర్గీస్‌ను కలిశారు. వారిలో ఇద్దరు ఫ్రెంచి భాష మాట్లాడుకుంటున్నారు. ఇతరులకు ఆ భాష రాదని వారి భావన.

"మన పాదాలయితే పరిశుద్ధ స్థలంలో ప్రవేశించాయి. కాని మన హృదయాలు ఆ స్థితిలో లేవు" అన్నాడు.

"ఒక సైనికుని చూచి మీరెక్కడికి వెళ్తున్నారు?" అని అడిగాడు.

"నేను ఏకాకిని నేనెక్కడికి పోతున్నానో నాకు తెలియదు" అన్నాడు.

సర్గీస్‌ని "నీవెవరు?" అని అడిగారు.

"నేను దేవుని సేవకుడిని" అన్నాడు.

ఆ ఫ్రెంచి వారు సర్గీస్‌కు ఇరవై రూపాయలు ఇచ్చారు. ఆ సొమ్మును ఓ భిక్షకునికి ఇచ్చాడు.

ఎనిమిది నెలలు అలానే తిరిగాడు. తొమ్మిదవ నెలలో అతనికి పాస్‌పోర్టు లేదని అరెస్టు చేశారు. అతనిని పోలీస్ స్టేషన్‌కి తీసుకొని వెళ్ళారు.

"నీవెవరు?" అని అడిగారు.

"నేను దైవసేవకుడిని. నాకు పాస్‌పోర్ట్ లేదు" అని చెప్పాడు. సర్గీస్‌ను సైబీరియా జైలుకు పంపించారు.

సైబీరియాలో ఒక ధనవంతుడైన రైతు దగ్గర పనిచేయ పంపించారు. అక్కడే వంటగదిలోను తోటలోను పనిచేస్తూ చిన్న పిల్లలకు విద్యా బోధన చేస్తూ జీవించసాగాడు.

**అతను రోగులకు ఎక్కువగా సేవచేసేవాడు.**

## పోల్కికుష్కా

**పోల్కీ కోర్టులో పనిచేసేవాడు.** బోయారినా అనబడే ఘనురాలి కోర్టులో పనిచేసేవాడు.

అతను ఒక ప్రత్యేకమైన స్థానములో ఉన్నాడు. బీదవాడు. భార్య పిల్లలతో చిన్న ఇంటిలో నివశించేవాడు. ఇల్లంతటికి ఒక గది మాత్రమే. పైన నాపరాళ్ళతో కప్పారు.

మెట్లు ప్రక్కనుండి బయటివైపున పైకి ఉన్నాయి. ఇంటి మధ్యలో రొట్టెలు కాల్చే బేకరి పొయ్యి ఓ మూల నాయన పోల్కీ పడక, మరోమూల వంట సామాగ్రి , గుడ్డలు వేసు కొనే పెద్ద పెట్టె, రాత్రి పూట చిన్నపిల్లలు పొయ్యి మీద వెచ్చగా పండుకుంటారు. ఇంట్లో మొత్తం అయిదుగురు పిల్లలు, అమ్మ, నాయన. ఇంతమంది ఈ చిన్న ఇంట్లో ఎలా ఇమిడిపోయారో ఎవరికి అర్ధం కాదు. అయినా ఇంత మంది ఒక్క గదిలో ఉన్నందున గదిలో కొంత వెచ్చగా ఉంటుంది. అది గొప్ప మేలుకదా! డబ్బున్నవారి ఇంట్లో ప్రతి గదికి ఓ మూల కట్టెలు కాల్చే పొయ్యి, దానిమీదగా పైకి పొగగొట్టాలు ఉంటాయి. ఇక్కడ చాలామందికి పొగగొట్టాలు లేవు. అందరికి రెక్క ఆడితే కాని డొక్క ఆడదు.

పోల్కీ భార్య అకులీనా గుడ్డలు ఉతుకుతుంది. చినిగిన గుడ్డలు కుడుతుంది. అన్నం వండి రొట్టెలు కాలుస్తుంది. ఆమెకి సమయం దొరికితే ప్రక్కింటి వారితో మాట్లాడుతుంది. పోట్లాడుతుంది. వాళ్ళకి అయిదు కోడిపెట్టలు, ఒక పుంజు, ఒక ఆవు, దూడ ఉన్నాయి.

ధనవంతురాలైన కోర్టు అధికారి బొయారినా వారికి రోజు పంపించే భోజనము ఇంట్లో అందరు తినగా ఇంకా దూడకు కుడితికి, కోళ్ళకు కూడా సరిపోతుంది. పొయ్యిలోకి కట్టెలు ఉచితముగా లభిస్తాయి. వారికి కూరగాయలు పండించు కోవడానికి ఇంటివెనుక కొంచెము స్థలము ఉన్నది. యజమానురాలికి ఉన్న పశువులపాకలు రెండు శుభ్రం చెయ్యడం, గుఱ్ఱాలను కడగడం, వాటి మంచి చెడ్డలు చూడడం పోల్కీ ఉద్యోగము. అంతా బాగానే ఉన్నది. కుటుంబమునకు ఏ కొదువ లేదు. అయితే –

పోల్కీ ప్రక్క ఊరిలో గుఱ్ఱాలకు వైద్యము చేసే చోట యవ్వన కాలములో పనిచేశాడు. ఆ శాల అధికారి దొంగ – గాలోడు. అతను చేసిన దుర్మార్గపు పనులకుగాను అతనిని సైబీరియాలోని సైనిక శిబిరానికి పంపించారు. అతని శిష్యరికములో పోల్కీ కూడా బాల్యంనుండి కొన్ని దొంగతనాలు దుర్మార్గపు కార్యాలు నేర్చుకున్నాడు. వాటిలో చిన్నతనం నుండి నైపుణ్యము సంపాదించాడు. పోల్కీ తల్లిదండ్రులు చిన్నతనములోనే చచ్చిపోయినందున అతనిని అదుపులో పెట్టేవారు ఎవరు లేకపోయారు.

అన్నిటికంటే ముఖ్యముగా అతనికి మద్యము అంటే ఇష్టం. అందుకొరకు చిన్నచిన్న దొంగతనాలు చేసేవాడు. వాటిని రహస్యముగా అమ్మి విస్కీ వోడ్కా త్రాగేవాడు. ఈ దొంగతనాలు ఎప్పటికైనా బయట పడ్తాయి. తనను కూడా సైబీరియైలోని సైనిక స్థావరానికి పంపిస్తారు అనే భయము అతనిని వెన్నాడుతూనే ఉంది.

అతను చిన్నతనములోనే ఓ రైతు కుమార్తెను పెండ్లి చేసుకున్నాడు. ఆ అమ్మాయి కష్టజీవి. ముగ్గురు పిల్లల్ని కన్నది. ఎంత పనిచేసినా అలుపు ఎరుగనిది.

ఒకసారి ఓ ఆసామి తోలు కళ్ళాలు దొంగిలించి పట్టు బడ్డాడు. ఆ ఆసామి పోల్కీని బాగాకొట్టి యజమానురాలికి అప్పజెప్పాడు. అప్పటినుండి చుట్టుప్రక్కల వారికి పోల్కీ అంటే దొంగ అనే పిలిచేవారు. తర్వాత కూడా రెండు చిన్న చిన్న దొంగతనాలు చేశాడు. ఇదంతా త్రాగుడు కొరకే. కోర్టు గుమస్తా అతనిని పిలిచి తిట్టి "నిన్ను సైబీరియాలోని సైనికులలో చేర్పిస్తాను జాగ్రత్త" అన్నాడు. ఈ సంగతి తెలిసి అతని భార్య చాలా ఏడ్చింది.

అతను బాగా త్రాగి ఓ రాత్రి ఇంటికి వస్తే అతని భార్య అతను ఎక్కడో దొంగతనము చేసి త్రాగి ఉంటాడని విపరీతముగా కొట్టింది. అతను చిన్నపిల్లాడిలాగా ఏడ్చాడు. "ఇంకొకసారి నేను త్రాగితే నా రెండు కళ్ళు పీకెయ్యి" అని ఏడ్చాడు. కాని కొద్దిరోజులలోనే మామూలుగా త్రాగుతు ఉండేవాడు.

తన యజమానురాలి ఇంట్లో ఎవరు ఉపయోగించని ఒక గది ఉన్నది. దానిలో ఓ గోడ గడియారం చిన్నది ఉంది. పోల్కీ దానిని దొంగతనము చేసి ప్రక్క ఊరిలో ఒకరికి అమ్మాడు. ఆ యజమానురాలు ఎన్నడు ఆ గడియారం సంగతి విచారంచదు అని నమ్మాడు. కాని ఆ వస్తువు కొన్నవాడు ఏదో పనిమీద కోర్టు గుమస్తా ఇంటికి వచ్చి పోల్కీ తనకు అమ్మిన గడియారం విషయం మాటల మధ్యలో చెప్పాడు. ఇంకేముంది యజమానురాలి చెవిన

ఈ వార్త పడింది. ఆమె పోల్కీని పిలిచి సంగతి అడిగింది. పోల్కీ ఆమె ఎదుట మోకాళ్ళ మీద వంగి పెద్దగా ఏడుస్తూ తన తప్పిదము ఒప్పుకొని కరుణించమని ప్రార్థించాడు. ఆ దయగల యజమానురాలు అతనికి బైబిలు గురించి పాపక్షమాపణ గురించి చాలా బోధించి, "ఈ సారికి వదిలేస్తాను జాగ్రత్తగా ఉండు" అన్నది. "నేనెప్పుడైనా ఇలా చేస్తే నన్ను గుంటతీసి బ్రతికుండగానే పాతిపెట్టండి లేదా నిప్పులతో కాల్చండి" అని ఏడ్చాడు.

పోల్కీ ఇంటికి వచ్చి మూలలో తన పడకమీద పండుకొని ఓ రాత్రి పగలు ఏడ్చి తన భార్యకు కూడా ప్రమాణం చేసి చెప్పాడు. అప్పటినుండి అతను దొంగతనం మానివేసి త్రాగుడు మానినప్పటికి జనం అతనిని నమ్మలేదు. అతనిని అనుమానంగా చూసేవారు.

కొంతకాలమైన తరువాత దేశంలో మిలటరీకి మనుష్యులను సమకూర్చేటప్పుడు పోలీసు సూపరిటెండెంటు పోల్కీని సైన్యంలోకి తీసికొని సైబీరియా పంపించాలనుకున్నాడు. కాని పోల్కీ యొక్క పశ్చాత్తాపమును గుర్తుపెట్టు కొన్ని యజమానురాలు పోల్కీని సైన్యములోకి తీసుకోవడానికి అనుమతి ఇవ్వలేదు.

ఒక సాయంకాలం పోల్కీ తన పడకమీద కూర్చుని పశువులకు ఓ మందు తయారు చేస్తున్నాడు. అస్కికా – కోర్టులో పనిచేస్తున్న ఓ యవ్వనురాలు పరుగెడుతూ వచ్చి రొప్పుతూ "పోల్కీ! నిన్ను యజమానురాలు వెంటనే కోర్టుకు రమ్మన్నారు" అని రొప్పుతూ నిల్చున్నది.

"సూపరిటెండెంటు గారు సైన్యములోకి మనుష్యులను ఎన్నుకుంటున్నారు. యజమానురాలు నీ పేరు కూడా అందులో చేర్చడానికి ఒప్పుకున్నారు" అని చెప్పింది.

అకులీనా (అతని భార్య) లేచి అతని బూట్లు తెచ్చి ఇచ్చింది. అవి చాలా పాతవి. ప్రక్కన కూడా చినిగిపోయి ఉన్నాయి. ఎవరో ఓ సైనికుడు చాలాకాలం క్రితం ఆ బూట్లు అతనికి ఇచ్చాడు. ఆమె పోల్కీని చూడకుండానే "చొక్కాకూడా మార్చుకుంటావా?" అన్నది.

"లేదు" అన్నాడు.

పోల్కీ బూట్లు వేసుకొనినంత సేపు అకులీనా అతనివైపు చూడలేదు. అలా చూడకపోవడమే మంచిది. ఎందుకంటే పోల్కీ ముఖం తెల్లగా పాలిపోయి ఉన్నది. పెదాలు వణుకుతున్నాయి. నిదానముగా తల దువ్వుకొని వెళ్ళబోతుంటే అకులినా లేచి అతని కోటు సరిచేసి టోపీని తుడిచి అతనికిచ్చింది. అతను వెళ్ళిపోయాడు.

ప్రక్కింటి ఆవిడ పోల్కీ భార్య కంటే చిన్నది. కాని ఈ రోజు ఉదయం చిన్న పిల్లల విషయంలో ఇద్దరు తగువులాడుకున్నారు. ఆమె పోల్కీని చూస్తూ "పోల్కీ! నిన్ను మీ యజమానురాలు రమ్మందా?" అని ఎగతాళిగా అడిగింది. ఆమె పోల్కీని ఎగతాళిగా మాట్లాడడం అతని భార్యను కించపరచాలనే!

"నిన్ను పొరుగు గ్రామానికి వెళ్ళి సరుకులు కొనుక్కొని రమ్మని చెప్పారు కదా! ఒక వేళ నిన్ను నమ్మి వాళ్ళు బజారు పంపిస్తే నాకు అరకిలో టీ పొడి తెచ్చిపెట్టు" అన్నది ప్రక్కింటి జన్నిస్.

అకులీనాకి భలే కోపం వచ్చింది ఆ మాటలు విని. ఆమెను ఎలాగైనా దండించాలనుకున్నది. కాని ఆమెకు మరియొక ఆలోచన వచ్చింది. పోల్కీని సైన్యములోకి పంపిస్తే యుద్ధములో మరణిస్తే తను పిల్లలతో సహా అనాధులు అయిపోతారు అని ఏడుస్తూ కూర్చుంది. కొంచెంసేపటికి పెద్దగానే ఏడ్వసాగింది. పిల్లలతో కలసి నేను ఆత్మహత్య చేసుకుంటేనే మంచిది అని అనుకున్నది.

అరగంట తర్వాత చిన్నకుమార్తె లేచి ఏడుస్తుంటే పాలు పట్టింది. బయట వీధిలో తన భర్త అడుగుల శబ్దం వినిపించింది. వెంటనే కన్నీళ్ళు తుడుచుకున్నది. పోల్కీ ఇంట్లోకి సంతోషంగా వచ్చి తలమీద టోపీని పడకమీద గిరాటు వేసి కూర్చున్నాడు.

"అమ్మగారు నిన్నెందుకు పిలిచారు?" అన్నది.

"ఈ ఊరిలో అందరు నన్ను పనికిమాలినవాడు అంటారు. కాని ఏదైనా కష్టమైన పనిచేస్తే నేనే చెయ్యాలంటారు" అన్నాడు.

**(సశేషం)**

చిన్నపిల్లల పేజి

# చేపల గాలం




పిల్లలూ! ఎలా ఉన్నారు? మీ వేసవి సెలవులను ఎలా గడిపారు. చాలామంది వాళ్ళ బంధువుల ఇళ్ళకు వెళ్ళి వుంటారు కదా! మరి మీరు మీ బంధువుల ఇళ్ళ దగ్గర వున్నప్పుడు బైబిలు చదివారా? మీ బంధువులలో ఎవరికైనా దేవుని గురించి తెలియక పోతే వాళ్ళకి దేవుని గురించి చెప్పారా? దేవుని గురించి తెలియని వారికి చెప్పటం క్రైస్తవులుగా మన బాధ్యత. దేవుని గురించి తెలియని వారిని సాతాను అనేక రకాలుగా ప్రలోభ పెట్టి దేవుని గురించి తెలుసుకోనియ కుండా చేస్తుంది. దేవుని గురించి తెలియని వాళ్ళకి ఎరను వేసి త్వరగా పాపంలో పడేటట్లు చేస్తుంది. కాబట్టి మనం చాలా జాగ్రత్తగా ఉంటూ దినదినము దేవునిలో ఎదుగుతూ నిత్యము సాతానును ఓడిస్తూ ఉండాలి. మరి మనం ఈ నెల కథ చదువుదామా?

ఒక సముద్రంలో ఫిన్ని అనే చేప ఉండేది. అది ఒకరోజు చేపలు పట్టే గాలంని చూసింది. చేపలు పట్టే గాలం చివర ఒక పురుగు వ్రేలాడదీయబడి ఉంటుంది. ఆ రుచికరమైన దానిని తినాలి అని దాదాపు దగ్గరికి వెళ్ళింది. ఫిన్ని ఎలాగైన ఆ పురుగుని మ్రింగాలని చూస్తుంది. కాని ఫిన్నికి ఆ సముద్రంలో ఉండే ఒక పెద్ద చేప చెప్పిన సంగతులన్ని ఒకటి తరువాత ఒకటి గుర్తుకు రావటం మొదలు పెట్టాయి. అయ్యో! నన్ను ఆ పెద్ద చేప దీనికి దూరంగా ఉండ మంది కదా. కాని ఎందుకు దూరంగా ఉండమంది అని ఆలోచనలో పడింది.

ఫిన్నీ అనుకుంది యింత మధురంగా ఉండే ఈ పురుగు ఎలా ప్రమాధకరంగా ఉంటుంది. ఆ పెద్ద చేప చెప్పిన భయంకరమైన కథలలో పురుగు కోసం ఏమి అంత పోరటం లేదు. అది నిజంగా ప్రమాదమా!

ఆ కథలన్ని నిజమేనా? అని ఫిన్నీ అనుకుంది నా అంతట నేనే ఎలాగైనా ఈ కథల గూర్చి నిజం తెలుసుకోవాలి అనుకొని అది వెనక్కి తిరిగి ఆ పురుగు వైపు ఈదటం మొదలుపెట్టింది. దానికి ఆ పురుగు తప్ప దానికి ఉన్న కొక్కెం మాత్రం ఒకకనిపించటంలేదు. అది నోరు బాగా తెరచి దాని దగ్గరకి వెళ్ళబోతుండగా ఇంతలో ఎవరో దాన్ని కొట్టినట్లు అనిపించింది. ఫిన్నీ వాళ్ల బాబాయి గబగబ ఫిన్నీ దగ్గరకి వచ్చి ఆ పురుగును తినకుండా లాగింది. అసలు నీకేమయింది? అడిగాడు ఫిన్నీ వాళ్ళ బాబాయి కార్కి. నువ్వు అసలు ఏమనుకున్నావు మేమంతా ఈ కథలన్ని సరదాకి చెప్పామనా?

"ఏమి బాబాయి నా కసలు ఏమి అర్థం కావటం లేదు. కొన్ని కొన్ని సార్లు అసలు ఆ కథలన్ని నిజమేనా అనిపిస్తుంది" అని ఫిన్నీ తడబడుతు చెప్పాడు. అప్పుడు బాబాయి కార్కి కళ్ళు మూసుకొని దుఃఖంతో నా వెనకాల


రా నేను నీకు చూపిస్తాను ఆ గాలం ఎంత ప్రమాదమో అన్నాడు. ఫిన్నీ వాళ్ళ బాబాయి వెనకాలే తీరం దగ్గరకు వెళ్ళాడు. వాళ్ళ ముందు లెక్కలేనన్ని చేపలు ఉన్నాయి. అవన్నీ బ్రతికే ఉన్నాయి. అక్కడ ఆ చేపలను చూడటానికి చాలా అందంగా ఉన్నాయి. కాని కొద్దిసేపట్లోనే అంతా అయిపోయింది. ఈ లోపలే ఒక పక్షి వచ్చి అక్కడ ఉన్న చేపలను తీసుకొని పోయింది. "చూశావా ఫిన్నీ ఈ విధంగా ఆ గాలం కూడా అంతా నాశనం చేస్తుంది. నేను నిన్ను ఇక్కడికి తీసుకొని రాకముందే ఇంతకు ముందు వేమ చెప్పింది నువ్వు నమ్ముతావు అనుకున్నాను. కాని నువ్వు నమ్మలేదు ఇప్పటికైన నమ్ముతావు అనుకుంటున్నాను" అన్నాడు ఫిన్నీ వాళ్ళ బాబాయి కార్కి.

కాని కొన్ని తెలివిగల చేపలు గాలంలో పడకుండా పురుగుని తీసుకొని తిన్నాయి కదా! కొన్ని కథలలో ఈ ఎరలో చిక్కుకున్న చేపలకి నాలాగా తెలివైనవి కావు అని తన గురించి అదే గొప్పగా అనుకోవటం మొదలుపెట్టింది ఫిన్నీ. రోజు రోజుకి ఆ సముద్రంలో చాలా గాలాలను చూస్తూ వుంది. అవి రకరకాల ఆకారాలలో రంగులలో ఉన్నాయి. రోజు కొంచెం కొంచెం దగ్గరకి వెళ్ళడం మొదలుపెట్టింది. ఇక ఒకరోజు ఆ పురుగును నోటితో పట్టుకొని ఆ ఎరలో చిక్కుకుంది. ఏంటి ఇది రుచిగా లేదు. అంటే ఇది నకిలీది అన్నమాట ఒక్కసారిగా ఫిన్నీ భయపడిపోయింది. ఈ ఎరని బయటకి ఊసేదా అని అనుకునేలోపలే నీటి నుంచి ఎవరో బయటకి లాగుతున్నట్లు అనిపించింది. చాలాసేపు పోరాడింది కాని అలసిపోయింది. దానికి అర్ధమైయింది. అది ఈ పోరాటంలో ఓడిపోయిందని. దానికి ఇంకో రోజు లేదు.

పిల్లలు మీరు తెలుసుకోవాలసినది ఒకటి సాతాను మనల్ని ప్రతి రోజు పాపానికి ఆకర్షింపజేస్తుంది. అది మనల్ని యేసు ప్రభువునుండి దూరం చేయాలని చూస్తువుంటుంది. సాతాను అలసిపోకుండా మనకి వెంట వెంటనే ఎరలను వేస్తానే ఉంటుంది. సాతను మన ముందు ఎలాంటి ఎరనైన వేస్తుంది అది అసలు దేనిని లెక్క చెయ్యదు. అది అబద్ధములకు తండ్రి యేసుప్రభువు ప్రేమించే వారిని నాశనం చేయాలనుకుంటుంది. అందుకని మనము ఎప్పుడు దేవుని కవచం వేసుకుని ఉండాలి. అంటే ప్రతి రోజు దేవుని వాక్యం చదివి ప్రార్థన చేసుకుంటే మనం ఎలాంటి ఆకర్షణనైన జయించి సాతానును ఓడించవచ్చు.

## పాఠకులకు గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెలలో పత్రికతో పాటు "పత్రిక కావాలా? వద్దా?" అనే విషయం పోస్ట్‌కార్డ్ ద్వారా తెలియజేయమని పోస్ట్‌కార్డ్ పంపించాము. అందువలన పోస్ట్‌కార్డ్ తిరిగి మాకు పంపని వాళ్ళందరికీ వరుసక్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది. పత్రిక కావలసిన వాళ్ళు ఫోన్‌ద్వారా కాని, పోస్ట్‌కార్డ్ ద్వారా కాని తెలియజేయగలరు. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను. **- ఎడిటర్**



# బైబిలు చరిత్ర

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

**వంశావళులు (కుటుంబ పట్టికలు):** బైబిల్లో సుదీర్ఘమైన వంశావళులు కన్పిస్తాయి. ఇశ్రాయేలు చరిత్రలో ప్రముఖుల కుటుంబ చరిత్రను ఈ వంశా వళులు తెలియజేస్తాయి. మత్తయి సువార్త ప్రారంభంలో కన్పించే వంశావళి యేసు దావీదు వంశం నుంచి వచ్చాడని తెలియజేస్తుంది (మత్తయి 1:1-17). యేసు దావీదు వంశీయుడని, ప్రవక్తల ప్రవచనాల ప్రకారం లోకాన్ని రక్షించడానికి వచ్చిన అభిషిక్తుడని తెలియ జేయడానికి మత్తయి సువార్త రచయిత ఈ వంశావళిని పేర్కొన్నాడు. పితరుల పట్టికలను బైబిల్లో ఎందుకు చేర్చారో అన్ని సందర్భాల్లో స్పష్టమైన కారణాలు తెలియనప్పటికీ ఇశ్రాయేలు ప్రజలకు ప్రాచీన పశ్చిమా సియా ప్రజలకు బంధుత్వాలు ముఖ్యమని వీటిని బట్టి తెలుస్తుంది. కొన్ని వంశావళులు పేర్ల పట్టికలు ఆది 5:1-32; 1దిన. 1-8; ఎజ్రా 8:2-14లలో వున్నాయి.

## బైబిలు అనువాదం

ఒక సందేశాన్ని దాని మూలభాషలో కాక వేరొక భాషలో వ్యక్తీకరించే ప్రక్రియ అనువాదం లేక తర్జుమా. ఈ సందేశం గీతం కావచ్చు, పద్యం కావచ్చు, సంఘటన కావచ్చు, ఆజ్ఞలుకావచ్చు, ఉపదేశం కావచ్చు. అపరిచిత భాషలోని సందేశాన్ని అర్థం చేసుకోడానికి అనువాదం అవసరం.

నేడు మనకు పరిచయం లేని భాషల్లో కొన్ని వేల సంవత్సరాల క్రిందట వ్రాసిన వేర్వేరు గ్రంథాల సంకలనమే బైబిలు. ఈ గ్రంథాలు 'బైబిలు'గా తుది రూపంలోనికి రావడానికి సుమారు వెయ్యేండ్లపైనే పట్టింది. బైబిల్లోని గ్రంథాలను ప్రాచీన హెబ్రీ అరమేయ భాషల్లో (పాత నిబంధన), గ్రీకు భాషలో (క్రొత్త నిబం ధన) వ్రాశారు. బైబిలు అనువాదం జరగకపోయినట్ల యితే బైబిలు చదవడానికి నేడు మనం ఆ యా భాషలు నేర్చుకోవలసి వుండేది.

## బైబిలు అనువాదం - తొలి దశలు

గ్రీకు భాష మాట్లాడే ప్రాంతాల్లో నివసించే యూదుల సౌలభ్యం కొరకు క్రీ.పూ. 250లో యూదు పండితులు హెబ్రీ లేఖనాలను గ్రీకు భాషలో వ్రాయడంతో బైబిలు అనువాదానికి నాంది పలికినట్లయ్యింది. ఈ అనువా దాన్ని సెప్టువజింటు అని పిలిచారు. యూదులు నివసించే ప్రాంతాల్లోని ప్రజలు మాట్లాడే భాషలో హెబ్రీ లేఖనాల నందించడం సెప్టువజింటు ముఖ్యోద్దేశమని స్పష్టమవు తోంది. హెబ్రీ భాషలోని యూదు లేఖనాలను గ్రీకు భాషలో వున్న క్రొత్త నిబంధనను కొన్ని వందల భాషల్లోకి అనువదించారు. వీటిలో అతి ప్రాచీన భాషలు (కాప్టిక్, అరబిక్, లాటిన్, సిరియా భాషలు) కూడ వున్నాయి. ఈ అనువాదాలు వెనుక వున్న ఉద్దేశం సెప్టువజింటు అనువాదం వెనుక వున్న ఉద్దేశమే: లేఖనాలను అందరూ తెలుసుకోవాలి.

## బైబిలు అనువాదం - తీరుతెన్నులు

ఈ మధ్యకాలం వరకు రూపాత్మక సమపరివృత్తి (లేక, సాంప్రదాయక సమతుల్యత) పద్ధతిలో బైబిలు అనువాదాలు జరిగాయి. ఈ పద్ధతిలో మూలభాషలోని వ్యాకరణం పదజాలం అన్నీ యథాతథంగా మరో భాషలోనికి తర్జుమా

అయ్యేవి. ఈ పద్ధతి ప్రకారం చేసిన అనువాదం హెచ్చు తగ్గులు లేకుండా నిర్దిష్టంగానూ సంక్షేపంగానూ వుంటుంది. అయితే, ఏ భాషలోకైతే అనువాదించారో ఆ భాషలోని (గ్రాహక భాషలోని) వ్యాకరణాన్ని వాక్యనిర్మాణ క్రమాన్ని ఉపయోగించకపోతే, అనువాద ప్రతి చాలా అసహజంగా అర్థరహితంగా వుంటుంది.

ఆకృతికి శైలికి అంత ప్రాముఖ్యత యివ్వకుండా పాఠకుల (లేక, శ్రోతల) అవసరాలకు తగిన విధంగా భావ వ్యక్తీకరణలో వచ్చిన మార్పుల ననుసరించి బైబిలు ననువదించడం 1960లో ప్రారంభమైంది. బైబిలు అనువాదంలో ఇది మరో పద్ధతి. ఈ అనువాదం ప్రయోజనాత్మక సమపరివృత్తి మీద ఆధారపడిన అనువాదం. మూల భాషలోని సందేశాన్ని యథాతథంగా కాక భావాన్ని(అర్థాన్ని) మాత్రమే వ్యక్తీకరించడం ఈ పద్ధతి ముఖ్యోద్దేశం. ఈ పద్ధతిలో ఆకృతికన్నా ప్రయోజనం ముఖ్యం.

ఏ పద్ధతి ననుసరించి బైబిలుననువదించినప్పటికీ, బైబిలు అనువాదకులు విమర్శాత్మక లేక ప్రామాణిక హెబ్రీ గ్రీకు మూలప్రతుల ఉపయోగించారు గనుక వారి అనువాదాలు కచ్చితమైనవి, విశ్వసనీయమైనవి.

## బైబిలు ఆంగ్లానువాదం

బైబిలు ఆంగ్లానువాద చరిత్ర సుదీర్ఘమైనది, క్లిష్టమైనది కూడ. విలియమ్ టిండేల్ (క్రీ.శ.1484 – 1536) ప్రముఖ ఆంగ్ల అనువాదకుడు. ఇతనికి 'ఆంగ్ల బైబిలు పితామహుడు' అనే పేరు కూడ వుంది. ప్రబలందరూ లేఖనాలను అర్థం చేసుకోవాలనేదే టిండేల్ ఆకాంక్ష. అయితే, మతోద్ధారణ కాలంలో వున్న రాజకీయపరమైన మతపరమైన వత్తిళ్ల మూలంగా బైబిలు ననువదించడానికి టిండేల్‌కు ఇంగ్లాండులో అనుమతి లభించని కారణంగా అతను జర్మనీ దేశానికి వెళ్లి అక్కడ క్రొత్త నిబంధన అనువాదాన్ని 1526 సంవత్సరం ఫిబ్రవరి నెలలో ప్రచురించాడు. ఎంతో విముఖత ఎదురైనప్పటికి టిండేల్ మాత్రం పట్టువిడువక హెబ్రీ భాషలోని పాత నిబంధన గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు. టిండేల్ 1530 సంవత్సరంలో పంచకాండాలను (ఆదికాండము – ద్వితియోపదేశకాండము) ప్రచురించాడు. 1536 సంవత్సరంలో టిండేల్‌ను మతవిరోధిగా తీర్మానించి అదే సంవత్సరం అక్టోబరు నెలలో అతనికి మరణశిక్ష విధించారు. టిండేల్ హతసాక్షి అయ్యాడు.

ఆంగ్ల బైబిలు అనువాదచరిత్రలో టిండేల్ అనువాదం ప్రముఖమైంది. ఈ అనువాద ఫలితమే కింగ్ జేమ్స్ వెర్షన్ బైబిలు ప్రచురణ (1611). ఇంగ్లాడు రాజైన జేమ్స్ (కింగ్ జేమ్స్) ఆదేశాల ప్రకారం కింగ్ జేమ్స్ వెర్షన్ బైబిలు రూపొందింది. ఆ కాలంలో వివిధ శాఖలకు చెందిన వేర్వేరు బైబిళ్లు వాడుకలో వుండేవి. ప్యూరిటన్లు జెనీవా బైబిలును, చర్చ్ ఆఫ్ ఇంగ్లాండువారు బిషప్స్ బైబిలును గ్రేట్ బైబిలును ఉపయోగించేవారు. ఇవన్నీ మూలభాషలోని లేఖనాల ఆధారంగా అనువదించిన బైబిలు ప్రతులే. కింగ్ జేమ్స్ బైబిలుకు ఆదిలో విముఖత ఎదురైనప్పటికీ తుదకు ఈ బైబిలు ప్రజాదరణ పొందింది. ఆ తర్వాత అనేక శతాబ్దాల పాటు ఆంగ్లభాష మాట్లాడే ప్రాంతాలన్నిటిలో ఈ బైబిలు అధికారిక బైబిలుగా పేరు పొందింది. కింగ్ జేమ్స్ వెర్షన్ బైబిలునే స్టాండర్డ్ ఇంగ్లీష్ వెర్షన్ అని కూడ పిలుస్తారు.

కింగ్ జేమ్స్ వెర్షన్ బైబిలు రచనాశైలి సమతుల్యతా పద్ధతి ననుసరించి హెబ్రీ గ్రీకు మూలప్రతుల అక్షరార్థ అనువాదం కాబట్టి కొందరికి నేడు ఇది అపరిచితంగా కన్పిస్తుంది. అయినప్పటికీ, బైబిలు అనువాదాల్లో నేటికీ అత్యధికంగా వాడుకలో ఉన్న బైబిలు కింగ్ జేమ్స్ వెర్షన్ బైబిలు మాత్రమే.

## బైబిలు – తెలుగు అనువాదం

దక్షిణ భారతదేశంలోని ద్రవిడ భాషల్లో తెలుగు భాష ఒకటి. అన్ని ప్రధాన ద్రవిడ భాషల్లాగానే తెలుగుభాషకు స్వంత లిపి సాహిత్యం వున్నాయి. తెలుగు బైబిలు అనువాదం పద్దెనిమిదవ శతాబ్దంలో ప్రారంభమైంది. 1727 సంవత్సరంలో ట్రాంక్విబార్ మిషనుకు చెందిన జర్మన్ లూథరన్ మిషనరీ రెవ.డా. బెంజిమిన్ షుల్జ్ తెలుగులో క్రొత్త నిబంధన అనువాదాన్ని పూర్తి చేశాడు (ఈయన తమిళ హిందీ భాషల్లో ప్రవీణుడు). 1732

సంవత్సరం నాటికి షుల్జ్ పాతనిబంధన అనువాదాన్ని కూడ పూర్తి చేశాడు. అయితే షుల్జ్ అనువాదాలు ప్రచురణకు నోచుకోలేదు. 1742 సంవత్సరంలో జర్మనీకి చెందిన ఫిలిప్ పెబ్రీషియన్ అనే లూథరన్ మిషనరీ మద్రాసు స్థావరంగా అవిరళకృషి సలిపి బైబిలును తెలుగులోకి తమిళంలోకి తర్జుమా చేశాడు. అయితే ఇవి కూడ ముద్రణకు నోచుకోలేదు. ఆ తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగి కెప్టెన్ జేమ్స్ డాడ్స్ అనే స్కాటిష్ అధికారి బైబిలును తెలుగు భాషలోకి అనువదించినట్లు సూచనప్రాయంగా తెలుస్తోంది (1795). అయితే అలుపెరుగని సిరంపూరు మిషనరీలు డా.విలియమ్ కేరీ నేతృత్వంలో 1805 సంవత్సరంలో తెలుగు బైబిలు అనువాదానికి శ్రీకారం చుట్టారు. క్రొత్త నిబంధన అనువాదం 1811 సంవత్సరంలో ముగిసింది. 1812 సంవత్సరంలో తెలుగు బైబిలు అచ్చయ్యే సమయంలో బైబిలు వ్రాతప్రతులు ముద్రణాలయం అన్నీ అగ్నిప్రమాదానికి గురయ్యాయి. మరలా సరిక్రొత్తగా బైబిలు అనువాదం ప్రారంభమయ్యింది. 1818 సంవత్సరంలో క్రొత్త నిబంధన ప్రచురణ జరిగింది. మూడు సంవత్సరాల అనంతరం పంచకాండాల (ఆదికాండము నుండి ద్వితీయోపదేశకాండము వరకు) ముద్రణ జరిగింది. లండన్ మిషనరీ సొసైటీకి చెందిన మిషనరీ అగస్టస్ డెస్‌గ్రాంజెస్ బైబిలును గ్రీకుభాషనుండి తెలుగులోకి అనువదించాడు. ఇతనికి టిప్పు సుల్తాన్ దర్బార్‌లో ఉద్యోగి అయిన ఆనంద రాయుడు అనే మహారాష్ట్ర బ్రాహ్మణుడు సహాయకుడుగా పని చేశాడు. వీరిరువురూ కలిసి క్రొత్త నిబంధనలో 1కొరింథీ పత్రిక వరకు అనువాదం పూర్తి చేశారు. ఇది ఇలా ఉండగా లండన్ మిషనరీ సొసైటీకి చెందిన ఎడ్వర్డ్ ప్రిచ్చెట్ అనే మిషనరీ ఆనందరాయుడు జాన్ గోర్డన్ అనేవారి సహాయంతో తెలుగు అనువాద కార్యక్రమాన్ని కొనసాగించాడు. అయితే, ప్రిచ్చెట్ 1824 సంవత్సరంలోను గోర్డన్ 1828 సంవత్సరంలోను మరణించారు. వీరిరువురూ పాత నిబంధనలో చాలా భాగాన్ని తెలుగులోకి అనువదించారు. 1831 సంవత్సరంలో మద్రాస్ కమిటీ వారు ఆదికాండము మరియు నిర్గమకాండములను (1 నుండి 22 అధ్యాయాలు) ముద్రించారు. మద్రాస్ సివిల్ సర్వీసు ఉద్యోగి అయిన సి.పి.బ్రౌన్ కూడ బైబిలును తెలుగు లోకి అనువదించాడు. బ్రౌన్ తెలుగుభాషలో ప్రావీణ్యుడు, తెలుగు వ్యాకరణాన్ని నిఘంటువును రచించిన పండితోత్తముడు. 1838 సంవత్సరంలో బ్రౌన్ అనువదించిన లూకా సువార్తను ప్రచురించడం జరిగింది.

1844 సంవత్సరంలో అనువాద సంఘం ఏర్ప డింది. లండన్ మిషనరీ సొసైటీకి చెందిన మిషనరీలు ఆర్.డి. జాన్‌స్టన్, జె.డబ్ల్యూ.గోర్డన్ (జె.గోర్డన్ కుమారుడు) అనేవారు బైబిల్లో చాలా భాగాన్ని తెలుగులోకి అనువదిం చారు. బ్రౌన్ తన అనువాదప్రతిని 1853 సంవత్సరంలో మద్రాస్ ఆక్జిలరీకి అందచేశాడు. బ్రౌన్ అనువదించిన తెలుగు బైబిలు వ్రాతపతిని లండన్‌లోని బైబిల్ హౌస్ గ్రంథాలయంలో భద్రపర్చారు. 1854 సంవత్సరంలో పాత నిబంధన ప్రచురణ జరిగింది. 1857 సంవత్సరంలో సవరించిన బైబిలును ప్రచురించారు.

వారు కాక మరికొందరు కూడ బైబిలును తెలుగులోకి అనువదించారు. జె.రెయిడ్ అనే లండన్ మిషనరీ సొసైటీ మిషనరీ అనువదించిన ఆదికాండమును 1841 సంవత్సరంలోనే మద్రాస్ ఆక్జిలరీవారు ప్రచురించారు.

అయితే, ఆ తర్వాత అనువాద కమిటీ పని నిదానంగా సాగింది. క్రొత్త నిబంధన అనువాదం వచ్చేసరికి ఏ గ్రీకు మూలప్రతిని ఉపయోగించాలో వీరిలో వీరికి ఏకాబిప్రాయం కుదరలేదు. చివరికి, లండన్ మిషనరీ సొసైటీకి చెందిన ఎస్.వార్ట్‌లా, జాన్ హే అనేవారు ఈ కమిటీనుండి వేరై సవరించిన గ్రీకు ప్రతి ఆధారంగా స్వంతంగా క్రొత్త నిబంధనను అనువదించి 1856 సంవత్సరంలో ప్రచురించారు. ఈ అనువాదాన్నే మద్రాస్ ఆక్జిలరీవారు 1860లో ప్రచురించారు. పాత క్రొత్త నిబంధనలను కలిపి 1857 సంవత్సరంలో మద్రాస్ ఆక్జిలరీవారు ప్రచురించిన సంకలనమే తొలి తెలుగు బైబిలు.

**(సశేషం)**

2

# మధ్యకాలము

**(ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)**



బ్రదర్ కె.సామ్రాట్

అలెగ్జాండరు మృతి చెందిన వెంటనే టోలమిసాటన్ ఐగుప్తును ముట్టడించెను. సమరయులు కాల్చి చంపిన ఆంద్రోమాఖస్‌కు బదులు లెమిడోన్‌ను అలెగ్జాండరు ఐగుప్తు గవర్నరుగా నియమించెను. ఈ లెమిడోన్ గవర్నరు నుండి సిరియా, పార్నిషియా, యూదయ దేశములను పొందుటకు టొలమిసాటన్ వ్యర్థముగా ప్రయత్నించి వారిని సముద్ర మార్గము ద్వారా, భూ భాగము ద్వారా వెంటాడి లెమిడోన్‌ను చెరగొని పోయి యూదయ తప్ప మిగిలిన సంస్థానము లన్నింటిని జయించాడు. ప్రస్తుత గవర్నరు యెడల వారికున్న సన్నిహిత సంబంధమును బట్టి గవర్నరు యొక్క ఉద్రిక్త స్థితి వారి మీద పడెను. యూదులు సబ్బాతు దినమును ఆచరించుట మానరని తెలిసికొని యెరూషలేమును ధ్వంసము చేసి, లోపరచుకొని వారిలో లక్షమంది యూదులను ఐగుప్తుకు చెరకొని పోయెను. ఈ విధముగా ఐగుప్తు రాజులకు యూదులు లొంగిపోయారు. టోలమీ ప్రభుత్వములో అయిదవ సంవత్సరము నందు ఒనియాతేన్ అను యూదుల ప్రధాన యాజకుడు మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు ప్రధాన యాజకుడయ్యాడు. అతని మంచి కార్యములు క్రీ॥పూ॥ 292 సం॥లో "ఎ క్లూస్" అను పుస్తకములో వ్రాయబడెను.

న్యాయాధిపతియైన సైమన్ తొమ్మిది సం॥లు ప్రధాన యాజకునిగా ఉన్నాడు. అతడు సునగోగుల యొక్క సహ కారంతో ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, మలాకీ, 2 దిన వృత్తాంతములోను పాత నిబంధనపు మత గురువుగా ఉండెను అతని కుమారుడైన ఓనియాన్ అప్పుడు చిన్నవాడు గనుక ఎలియాజరు క్రీ॥పూ॥ 291లో యాజకుడయ్యాడు.

టోలమిసాటన్ తర్వాత అతని కుమారుడు టోలమీ ఫిలడెల్ఫిన్ క్రీ॥పూ॥ 285లో గవర్నరుగా నియమించబడెను. ఐగుప్తులోని గొప్ప గ్రంథాలయము ఇతని తండ్రిచే స్థాపించబడెను. అందులో గ్రీకు బాషలో తర్జుమా చేయబడిన ధర్మశాస్త్రమును ఉంచిరి. ధర్మశాస్త్ర గ్రంథమును ఎలియాజరు అను ప్రధాన యాజకుని సమక్షములో చేసిరి.

టోలమీ ఫిలడెప్ఫన్ 39 సం॥లు పరిపాలించి తన 63వ యేట క్రీ॥పూ॥ 247లో మరణించెను. అతడు పాండిత్యము నందు అనుభవజ్ఞుడు. అందువలన నిపుణత గలవారందరు అన్ని ప్రాంతములనుండి ఆయన సంస్థానమునకు వచ్చి అతని యొక్క గౌరవము, అభిమానము పొందేవారు. వీరిలో ధియోక్రటన్, కాలిమేకస్, లైకోఫ్రాన్, అలాటన్ అను కవులును, మాక్తో అను చరిత్రకారుడును ఉన్నారు.

క్రీ॥పూ॥ 247లో టోలమీ ఎవర్‌గేటస్ అను నతడు తన తండ్రియైన టోలమిసాటర్ తరువాత ఐగుప్తునకు రాజాయెను. అతడు యెరూషలేమునందు న్యాయవాది అయిన సైమన్ కుమారుడగు ఒనియాన్‌ను కనుగొనెను. ఒనియాన్ యాజకుని దుస్తులలో ఉండి వృద్ధుడై, బలహీను డుగా, పిరికివాడుగా ఉండెను. మరియు ప్రధానయాజకుడు అనేక సంవత్సరముల నుండి వార్షిక పన్ను తొలగించెనని ఎవర్‌గేటన్ తెలిసికొని సుంకపు పన్నులు చెల్లించనిచో ఎవరినైనా పంపించి వారిని దేశబహిష్కరణ గావించెదనని భయపెడుతూ మొత్తము డబ్బు వసూలు చేయమని యోరూషలేమునకు పంపెను.

ఈ వత్తిడి యెరూషలేమును అల్లకల్లోలము చేసెను. ప్రధానయాజకుని బంధువైన యోసేపు అను వ్యక్తి తన బావ

యొక్క దుర్మార్గతను, అతడు జరిగించిన అన్యాయమును గూర్చి తన అక్క పక్షముగా వ్యవహరించుచు గద్దించెను. ఒనియాన్ యొక్క అలెగ్జాండ్రియా ప్రయాణమును "మంచి దండయాత్ర" అని నిర్ధారించాడు. అతని బావగారిని నిరాకరించిన తర్వాత రాజుగారి ఉగ్రతను చల్లార్చుటకు వ్యక్తిగతంగా కలుసుకొనుటకు, నిర్ణయించుకొనగా ప్రధానయాజకుడు దానిని అంగీకరించి క్రీ॥పూ॥ 226లో ప్రజల చేత అమోదించబడెను.

ఎథేనియానును యోసేపు తన స్వగృహమందు గొప్ప వినోదములతో తన సమయము గడుపునట్లు చేసెను. అతడు వెళ్ళుచున్న సమయములో ఎంతో విలువైన బహుమతులతో అలెగ్జాండ్రియా దేశపు రాజు నొద్దకు పంపెను. బహుమతులను స్వీకరించుటకు అతనిని ఆ దేశపురాజు అంగీకరించెను. సిరియా, ఫెనీషియాయొక్క వార్షిక పన్నులు ఆదాయములు గురించి తెలియజేయుట ద్వారా రాజు నుండి ఎక్కువ మన్ననలను పొందగల్గెను. సిరియా, ఫెనీషియా, యూదయ, సమరియ దేశములపై నున్న రాజుయొక్క సైన్యాధ్యక్షుని కలిసికొనుటకు ఆ దేశపు రైతులతో కలిసి వెళ్ళు సమయములో ఈ విషయములన్నిటిని సేకరించెను. తన మామయొక్క బాకీ విషయమై కూడా రాజుని వెంటనే తృప్తిపరచెను.

క్రీ॥పూ॥ 221 సం॥లో యెరూషలేమునందు అన్ని విషయములు ప్రశాంత పరచబడెను. టోలమి ఎవర్‌గేటన్ తర్వాత ఐగుప్తునకు రాజుగా వచ్చి అంతియొకన్ సైన్యమును ఓడించి, తన ఐదు సంవత్సరముల పాలనలో యోరూషలేము యాత్రను కొనసాగించి తాను జయించిన ప్రాంతములన్నిటిని దర్శించెను. కాని ఆ యాత్ర నిజముగా యూదులకు కష్టకాలమాయెను. క్రీ॥పూ॥ 217 సం॥లో ఫిలోపేటర్‌కు దేవుని ఆలయమందలి అతి పరిశుద్ధ స్థలమునకు సంవత్సరమునకు ఒకసారి "గొప్ప పాపపరిహారార్ధబలి" నర్పించు సమయమందు వెళ్ళవలెననెడి ఆశ కల్గిన వాడై యుండెను గాని ప్రధాన యాజకుడు తప్ప అతి పరిశుద్ధ స్థలములోనికి ఎవ్వరిని అనుమతింపబడరు. గనుక ప్రజల యొక్క ఏడ్పులు, అంగలార్పుల ద్వారా అతడు నిరాకరించబడెను. కాని అతడు ఇంకను ఆలయ గర్భాలయములోనికి వెళ్ళుచుండగా అతనిని పైశాచిక విధానములో ముట్టివేసి సగము చచ్చిన స్థితిలో వెలుపలకు తెచ్చిరి. అతడు మేల్కొనిన తర్వాత పట్టణము విడచి వెళ్ళుచూ ప్రతీకారము తీర్చుకొందునని ప్రతిజ్ఞ చేసెను. ఆ విధముగా అతడు అలెగ్జాండ్రియా చేరక ముందే యూదుల హక్కులన్నిటిని, సదుపాయములన్నింటిని తొలగించి వేసెను. మరియు అతడు ఆరాధించు "ఒక్నాస్" అను దేవుని గౌరవార్థం యూదుల నందరిని ఒలీవ ఆకారములో మరణ తుల్యమైన వ్యధతో కాల్చి చంపవలెనని ఆదేశించెను. ఎవరైతే అతని దేవునికి బల్యర్పణ చేయలేదో వారందరిని సంస్థానము నుండి తొలగించెను. ఐగుప్తులో అతడు ముట్టడి వేసిన యూదులందరు అలెగ్జాండ్రియాలో గుర్రపు పందెముల స్థలమందు (హిప్పోడ్రాక్) ఏనుగుల చేత త్రొక్కబడి మరణించునట్లు మూయబడిరి. కాని సర్వశక్తిమంతుడైన దేవుడు ఆ దృశ్యమును తిలకించుటకు వచ్చిన వారి వైపే ఆ మృగములను మళ్ళించెను. అందువలన చూచుటకు వచ్చిన వారనేకులు హతులైరి. రాజును అతని అనుచరులను ఈ దృశ్యమును చూచి భయభ్రాంతులయి వెంటనే యూదులనందరిని గుర్రపు పందెముల స్థలము నుండి విడిపించెను. అంతేకాక వారి దేశమంతటిని వారి ఆధిక్యతలను తిరిగి సమకూర్చి వారికి వ్యతిరేకముగా వ్రాయబడిన ప్రతి దాఖలను రద్దు చేసెను. హింసింపబడుటకు నిరాకరించిన యూదులు వారి మతమును నిరాకరించి వెలుపలకు వచ్చి అన్య దేవతలను కొలుచునట్లు ఒప్పుకొనిరి. అట్టి వారందరిని రాజు చంపించెను.

క్రీ॥పూ॥ 204లో టోలమీ ఫిలోపిటర్ కుమారుడైన టోలమీ ఎఫిఫేనస్ 5 సంవత్సరాల వయస్సు గలవాడై యుండెను. అందువలన ఘనుడగు అంతియోకస్‌కు సిరియా పాలస్తీనా దేశములను తిరిగి పొందు అవకాశము కలిగెను. అతని సాహసయాత్రలో యూదులు అతనిని ఎంతో గౌరవించిరి. అందువలన అతడు వారికి ఎంతో ఉపయుక్తమైన పనులు గావించెను. వారి చట్టానికి, మతానికి అనుకూలంగా జీవించుటకు స్వతంత్రులైరి. అన్యులు వారి ఆలయములోని

అతి పరిశుద్ధ స్థలమునకు వెళ్ళుటకు నిరాకరించిరి. టాలమీ ఎపిఫేనస్‌కు యుక్త వయస్సు వచ్చినప్పుడు అంతియోకస్ అతనితో సంధి చేసికొని తన కుమార్తెతో టాలమీ ఎపిఫెనస్‌కు వివాహము జరిగించెను. సిరియా, పాలస్తీనా ఆమె భాగముగా ఇచ్చెను. ఆ ప్రదేశపు మంత్రియు, టోలమీ అనుచరుడైన యోసేపు అంతియోకస్ ద్వారా తొలగింపబడి యుండెను. అతను తిరిగి ఈ సమయంలో అధికారమునకు వచ్చెను.

టెలమీ ఎపిఫేనస్‌కు అనతికాలంలోనే కుమారుడు జన్మించెను. కుమారుని జన్మదిన సందర్భముగా ఆ రాజ్యపు అధికారులు గొప్ప వ్యక్తులు వారి శుభాకాంక్షలు తెల్పుచు బహుమతులు ఇచ్చుట అనునది ఆ దేశ సంప్రదాయము. యోసేపు వృద్ధుడైనందున అంత దూరం ప్రయాణం చేయలేక అతని కుమారుడైన హిరైకానస్‌ను పంపెను.

క్రీ॥పూ॥ 187 సం॥లో హిరైకానస్‌కు అతని తండ్రి ద్వారా లెక్కలేనంత ద్రవ్యము అప్పుగా ఇవ్వబడెను. మరియు అలెగ్జాండ్రియా చేరుకొనిన తరువాత వెయ్యి తులములు లేక రెండువేల పౌండ్లు అప్పుగా ఇవ్వబడెను. ఆ ద్రవ్యములో రాజుకు వందమంది అందమైన బాలురను, రాణికి చాలా మంది అందమైన కన్యకలను ఒక్కొక్కరిని ఒక్కొక్క తలాంతు చొప్పున కొని ఒక్కొక్క తలాంతు వారి చేతులలో ఉంచి మిగిలినవన్నీ ఆ సంస్థానాధిపతులకు గొప్ప అధికారులకు ఇచ్చెను. సుళువుగా తన తండ్రి స్థానమును రాజు రాణి యొద్ద నుండి, యోర్దాను ఆవలనున్న దేశమంతటిపై రాజ రికపుశిస్తు వసూలుకై నియమించబడెను.

హిరైకానస్ ఆ విధంగా అతనికి ఉన్న ధనాగారమంతటిని దుర్వినియోగపరచిన తర్వాత ఒక బలమైన రక్షకభటునితో కార్యాలయము ఏర్పరచుటకై వెళ్ళుచుండగా అతని సహోదరులను కలుసుకొని వారిలో ఇద్దరిని చంపెను. అతడు యెరూషలేమునకు వచ్చెను. కాని అతని తండ్రి సముఖమునకు వచ్చుటకు అతని తండ్రి నిరాకరించెను.


అతడు అందరిచే నిరాకరించబడెను. త్వరలోనే అతని తండ్రి మరణించిన పిదప, తన తండ్రి భవనములో ఉన్న సహోదరులను బలవంతముగా త్రోసివేయుటకు పూను కొనెను. అందువలన యెరూషలేము యొక్క సమాధానము తాత్కాలికముగా కదలింపబడెను. చివరికి అతని సోదరులు, ప్రధానయాజకుని ద్వారా, ప్రజల ద్వారా మన్ననలను పొంది వారి సహాయముతో యోర్దాను వైపుకు అతనిని తరిమివేసిరి. అక్కడ ఒక బలమైన దుర్గమందు అతడు నివశించెను. అంతియోకస్ ఎపిఫనెస్ సిరియా దేశపు రాజుగా క్రీ॥పూ॥ 175 లో రాజ్యమునకు వచ్చి హిర్కోనస్‌ను భయపెట్టినందున అతడు తనంతట తానే కత్తిపాలై మరణించెను.

ఘనుడగు అంతియోకస్ దెనీమియ వాసులచే చంప బడెను. జ్యూపిటర్ దేవాలయమును కొల్లగొట్టి తన ఒప్పందం ప్రకారం దానిని రోమీయుల కిచ్చుటకై ఒక రాత్రి ప్రేరేపించ బడినవాడై దేనీయ వాసులచేత చంపబడెను. ఆ తర్వాత అతని కుమారుడైన సెల్యూకస్ ఫిలోపేటర్ సిరియా, యూదయ దేశములకు రాజుగా అధిష్ఠించి అంతియొకలో నివశించెను.

సెల్యూకస్ ఈ ప్రాంతములకు రాజైన ప్రారంభ దినములలో అతని తండ్రి చేసిన మేలంతటిని యూదులకు చేసెను. అటు తర్వాత బెన్యామీనియుడైన సైమన్ ద్వారా ఆలయములో గొప్ప ధనాగారమున్నదని తెలుసుకొని దానిని తెచ్చి అంతియొకయలో ఉంచునట్లు హెలియోడరస్‌ను పంపెను కాని అతడు ఒక దేవదూతల గుంపు పవిత్ర ధనాగార మును సమీపించకుండా పోరాడుటకై నిలువబడుటను చూచి భయపడుచు మౌనియై నేలవ్రాలెను. ప్రధానయాజకుడు అతని కొరకై దేవునికి విజ్ఞాపన చేయగా తిరిగి మేల్కొనెను.

**(సశేషం)**

**ఇంటర్‌నెట్‌లో తెలుగు బైబిలు కొరకు దర్శించండి :**
**www.onlinetelugubible.net**




# ఇద్దరు స్నేహితుల కథ

## (సజీవ సాక్ష్యము)

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసు నామమున శుభాభి వందనములు.

ఈ సంచికలో దేవుడు చేసిన అద్భుతమైన స్వస్థతను గూర్చి మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. ఇక వినండి ఇద్దరు స్నేహితుల కథ.

ఒంగోలు పట్టణం సివారురలో ఉన్న జాషువా కాలనీలో ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారిపేర్లు నారాయణ మరియు ప్రభు. నారాయణ బేల్దారి మేస్త్రి. ప్రభు కూరగాయలు వ్యాపారం. ఇద్దరు ఒకే కాలనీలో ఉంటు జీవనము సాగిస్తున్నారు. అయితే ప్రభు రెడ్డి కులానికి చెందిన వ్యక్తి. ఇతడు కొన్ని నెలలుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడు చున్నాడు. కుటుంబీకులు మరియు ఇతర వ్యక్తులు కలసి ఇతనిని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. కొన్ని రోజుల ట్రీట్‌మెంట్ తరువాత డాక్టర్లు ఇక లాభం లేదని గుంటూరు తీసుకొని వెళ్ళండి అని చెప్పారు. కుటుంబ స్తులు డబ్బులు పోగు చేసుకొని గుంటూరులో ఉన్న యన్.ఆర్.ఐ హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళారు. అక్కడ కూడ కొన్నిరోజులు ట్రీట్‌మెంటు తీసుకున్న తరువాత డాక్టర్లు ఇక లాభం లేదు ఇతడు చనిపోతాడు. ఎన్ని మందులు వాడిన ఇక ఉపయోగం ఉండదు కనుక ఇతనిని ఇంటికి తీసుకొని వెళ్ళండి అని చెప్పారు. అప్పుడు చేసేది ఏమి లేక అతనిని ఇంటికి తీసుకొని వచ్చారు. మరల కొన్ని దినముల తరువాత ఎలాగైనా ఇతనిని బ్రతికించుకోవాలని కుటుంబస్థులు మద్రాసులో ఉన్న పెద్ద హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళి చేర్పించడం జరిగింది. అయితే వీరికి అక్కడ కూడ నిరాశే మిగిలింది. యౌవ్వనస్థుడైన "ప్రభు" దేహం పూర్తిగా క్షీణించి పోయింది. అవయవాలు పనిచేయడం ఆగిపోయినాయి. శ్వాస తీసు కోవడం కూడ కష్టమయింది. మనిషి చూచుటకు జీవములేని శవముగా మారిపోయాడు. అప్పుడు డాక్టర్లు ఇక ఇతడు చనిపోయినట్లే వాడుతున్న మందులకు ఇతని దేహము స్పందించడములేదు. ఇక ఇతడు చనిపోయినట్లే శ్వాస పీల్చుకోవడం అతి కష్టముగా ఉన్నది. కనుక ఇతనిని మార్చురి గది (శవాలు బధ్రపరుచు గది)లో పెట్టవలసి ఉన్నదని చెప్పారు. ఈ వార్త విన్న కుటుంబీకులు ఎంతో క్రుంగిపోయి, కుమిలిపోయి చేసేది ఏమిలేక కొన ఊపిరితో ఉన్న "ప్రభు"ని ఒంగోలు జాషువా కాలనీలో ఉన్న తన స్వగృహానికి తీసుకొని వచ్చారు. డాక్టర్లు చివరిగా చెప్పిన మాట ఏమిటంటే ప్రభుకి ప్రాణాంతకరమైన వ్యాధి సోకిందని తెలియజేశారు. ఒంగోలు తీసుకొని వచ్చిన తరువాత అతని స్నేహి తులు, బంధువులు చివరి చూపుకొరకు అతని యొద్దకు వచ్చుచున్నారు. కుటుంబస్థులు అతను బ్రతకడని తులసి నీరు తీసుకొని వచ్చి నోటిలో పోశారు. అయితే కొన ఊపిరితో ఉన్న ప్రభు ఆ నీరు మింగలేక ఊసివేశాడు. కుటుంబస్థులు దండలు, ఫ్లెక్సీ భూస్థాపన కొరకు సిద్ధం చేస్తున్నారు. ఎన్నో డబ్బులు ఖర్చుపెట్టారు. కొన్ని నెలలు హాస్పిటల్‌లో చూపిం చారు. అయినా లాభం లేక అందరు దుఃఖములో మునిగి పోయారు. ఈ విధముగా ఉండగా నాకు నారాయణ మేస్త్రి దగ్గరనుండి ఫోను వచ్చింది. ముందు చెప్పిన విధంగా నారాయణ ప్రభు రెడ్డి ఇద్దరు మంచి స్నేహితులు. నారాయణ మేస్త్రి ఈ విధంగా చెప్పాడు. అయ్యా ! మీరు నాతో వచ్చి చావు బ్రతుకుల్లో ఉన్న నా స్నేహితుని కొరకు మీరు ప్రార్థన చేయాలి. మీ ప్రార్థన దేవుడు ఆలకించి నా స్నేహితుని స్వస్థపరుస్తాడు దయచేసి మా కాలనీకి వచ్చి నా స్నేహితుని కొరకు ప్రార్థించమని జాషువా కాలనీకి రమ్మని ఫోనులో

వేడుకున్నాడు. అప్పుడు నేను అతనిని గురించి ప్రార్థించి దేవుని వేడుకున్నాను.

ప్రభువా! ఈ కాలనీ వాసులు కుటుంబస్థులు మరియు స్నేహితులు ప్రభు రెడ్డి స్వస్థత కొరకు నీవైపునకు చూస్తున్నారు. అతనిని స్వస్థపరచు తండ్రి అని ప్రార్థించాను. ప్రార్థించి నేను లేచిన తరువాత నాకు ఎంతో నెమ్మదిగా ఉంది. యేసు ప్రభువు చావు బ్రతుకుల్లో ఉండి, మరణకరమైన ఈ యౌవ్వనస్థుడిని స్వస్థపరుస్తాడని నాకు గట్టిగా విశ్వాసము కలిగింది. ఈ సంఘటనలో మీకు ఒక విషయము చెప్పాలి. నారాయణ మేస్త్రి యేసు ప్రభువుని ఇంకా పూర్తిగా నమ్ము కోలేదు. ఈయనకు కూడ అనేక వ్యసనాలు ఉన్నాయి. మరియు ఉద్యమాలలో పాల్గొంటు ఉంటాడు. వృత్తిరీత్య బేల్‌దార్ మేస్త్రి. అయితే ఇతని విశ్వాసము గొప్పది. ఇతడు యేసుని గట్టిగా నమ్మాడు. యేసుప్రభువు తన స్నేహితుని స్వస్థపరుస్తాడని. ఆ రోజు నేను మరికొందరు సహోదరులు కలిసి ప్రభు ఇంటికి వెళ్ళాము. నారాయణ మేస్త్రి మాకు ఎదురుపడి మమ్ములను ప్రభు ఇంటికి తీసుకొని వెళ్ళాడు. అప్పటికే అక్కడికి దాదాపు 50మంది ప్రార్థనకు వచ్చి ఉన్నారు. ఒక పెద్ద టెంటు, కుర్చీలు, లైటింగ్ మరియు మైక్ సిస్టమ్ అంతా ఏర్పాటుచేసి ఉన్నారు. ఇరుగుపొరుగు వారు, కాలనీ వాసులు అందరూ ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఏమి జరుగుతుందో అని. అదే సమయములో ప్రభు రెడ్డి ఇంటి బయట మంచము మీద స్పృహలేని స్థితిలో పడి ఉన్నాడు. అప్పుడు నేను "లూకా సువార్త" 7వ అధ్యాయంలో ఉన్న ఒక కథ చెప్పాను. "నాయీను గవిని" దగ్గర యేసుప్రభువు విధవరాలి యొక్క ఏకైక కుమారుడ్ని స్వస్థపరచుట". యేసు ప్రభువు గవిని దగ్గర పాడిని ముట్టి నపుడు చనిపోయిన యౌవ్వనస్థుడు బ్రతికించబడ్డాడు. అందరు వాక్యము చాలా శ్రద్ధగా విన్నారు. అదే సమయంలో వారందరిలో ఒకటే ప్రశ్న "ప్రభురెడ్డి బ్రతుకుతాడా", యేసు ప్రభువు స్వస్థపరుస్తాడా"! నేను నాతోటి సహోదరులు కలిసి ఇంటిలోనికి వెళ్ళాము. అక్కడ మంచము మీద ప్రభురెడ్డి పడుకొని ఉన్నాడు. ఇంటి వారందరూ ఏడుస్తూ ఉన్నారు. ప్రభురెడ్డి అక్క విశ్వాసి ఆమెతో నేను అన్నాను కొబ్బరి నూనె ఉందా అని! వెంటనే కొబ్బరి నూనె తెచ్చి నా చేతిలో పెట్టింది. నేను ప్రార్థించి మూడు చుక్కలు ప్రభురెడ్డి నోటిలో వేశాను. ప్రభురెడ్డి తన పాపములు యేసు సన్నిధిలో ఒప్పుకున్నాడు. యేసుప్రభువా నన్ను మన్నించుమని వేడుకున్నాడు. నేను చెయిపెట్టి అతనిని ముట్టి వేడుకున్నాను. నాతో కలసి ఉన్న సహోదరులు అందరు వేడుకున్నారు. నేను వారియొక్క అమ్మతో చెప్పాను. అమ్మా! మీ కుమారుడు బ్రతుకుతాడు. నిశ్చయంగా ఉండండి అని చివరిగా ప్రార్థించి మేము ఇంటికి వచ్చేశాము.

ఇట్లుండగా మూడు రోజులు తర్వాత నా ఆఫీస్‌కి నారాయణ మేస్త్రి వచ్చి నాతో ఇలా అన్నాడు యేసుప్రభువు చాలా గొప్పవాడు. ఆయనే నిజమైన దేవుడు. ఆయనలో మహిమ ఉన్నది. దయచేసి నాకు బాప్తిస్మము ఇవ్వండి. నేను ప్రభువుని నమ్ముకుంటున్నాను. ఈ మాట వినగానే నాకు చాలా సంతోషము కలిగింది. అప్పుడు నేను నారాయణ మేస్త్రిని అడిగాను ఇంత అకస్మాత్తుగా నిర్ణయం తీసుకో వడానికిగల కారణం ఏమిటి? అప్పుడు అతడు చెప్పాడు. అయ్యా! నా విన్నపము మన్నించి నా దగ్గరకు వచ్చి ప్రభు రెడ్డికి ప్రార్థన చేసావు. యేసుప్రభువు చాలా గొప్పవాడు. నా స్నేహితుడు బ్రతికాడు. యేసుప్రభువు బ్రతికించాడు. కనుక నేను కూడ ఆయనను నమ్ముకుంటున్నాను. ఈ వార్త వినగానే నాకెంతో సంతోషం కలిగింది. అన్ని నామముల కంటే ఘనమైనది యేసయ్య నామము. ఆ నామములోనే రక్షణ, స్వస్థత కలదు. రెండు రోజుల తరువాత కొత్తపట్నంలో ఉన్న సముద్రంలో నారాయణ మేస్త్రికి బాప్తిస్మము ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ప్రతి ఆదివారము తన స్నేహితుడైన ప్రభురెడ్డిని తీసుకొని ఆరాధనకు వస్తున్నాడు. ఎంతగొప్ప సాక్ష్యమో కదా! నారాయణ విశ్వాసమే ప్రభురెడ్డిని స్వస్థ పరిచింది. ఇప్పుడు ప్రభురెడ్డి జీవితమే ఒక సజీవ సాక్ష్యము. నా ప్రియ స్నేహితులారా! యేసు ప్రభువు ఎంతైనా నమ్మదగిన వాడు. ఆయనకు అసాధ్యమైనది ఏదియు లేదు. "నీవు నమ్ము ఆయన మహిమను చూచెదవు". "యేసు ప్రభువు నామమునకే మహిమ, ఘనత ప్రభావములు యుగయుగములు చెల్లును గాక" ఆమెన్. "దేవుడు మిమ్ములను దీవించును గాక".

# నేపాల్ మిషన్ రిపోర్ట్

**- రెవ. డా. కె.విక్రాంత్**

ప్రియ పరిశుద్ధత పాఠకులకు క్రీస్తు నామమున శుభాభి వందనములు. ప్రభువు కృప వలన మేమందరము క్షేమము. మీరును క్షేమమని తలంచుచున్నాను. ఈ సంవత్సం ఏప్రిల్ మాసం 25వ తారీఖున అనగా శనివారం మధ్యాహ్నం నేపాల్ దేశంలో సంభవించిన భయంకర భూకంపం మీ అందరికి తెలుసు. సుమారు 8,500 పైగానే చనిపోయారని చెబుతున్నారు.

నేపాల్ దేశం గురించి నేను మీతో కొన్ని విషయాలు పంచుకోవాలి. 2010వ సంవత్సరము నేను కొంత మంది సహోదరులము కలిసి నార్త్ఈస్ట్ ఢిల్లీలో పాస్టర్ల సదస్సు నిర్ణయించినప్పుడు నా దగ్గరకు ఒక నేపాలి పాస్టరు వచ్చి తనను పరిచయం చేసుకున్నాడు. ప్రస్తుతం అతను ఢిల్లీలోనే ఉంటూ వలస వచ్చిన నేపాలి ప్రజల మధ్య సేవ చేస్తూ ఉన్నాడు. అతను నా రెండు చేతులు పట్టుకొని "అయ్యా! మీరు దయచేసి మా దేశం ఒకసారి రండి. అక్కడకు వచ్చి సువార్తను ప్రకటించండి. దయచేసి రండి అని బ్రతిమి లాడాడు".

నేను చెప్పాను "ప్రార్ధన చేయండి. ప్రభువు చిత్తమైతే తప్పక వస్తాను". నేను సహోదరులము కలిసి ఒక సంవత్సరం పాటు భారము కలిగి ప్రభువును అడిగాము.

నేపాల్ దేశము కొరకు ఎడతెగక ప్రార్ధన చేశాము. ప్రభువు మా ప్రార్ధన ఆలకించి 2011వ సంవత్సరము ఆగష్టు నెలలో నేను నాతో పాటు మరో ఐదుగురు సహోదరులము కలిసి నేపాల్ దేశము వెళ్ళుటకు ప్రభువు కృప అనుగ్రహించాడు. అప్పటి నుండి అనగా 2011వ సంవత్సరము నుండి ఇప్పటి వరకు నేపాల్ దేశములో సేవను కొనసాగిస్తూ ఉన్నాము. ఇది కేవలం దేవుని కృప మాత్రమే. దాదాపు 800 మంది దైవ సేవకులకు, మిషెనరీలకు, సువార్తికులకు తర్ఫీదు ఇచ్చియున్నాము. ఒక సంవత్సరం పాటు చిన్న పిల్లలకు ఉచిత భోజనం మరియు విద్యను అందించి యున్నాము. ప్రస్తుతం 8 గ్రామాలలో అక్కడ స్థానికంగా ఉన్న దైవ సేవకులతో కలిసి పని చేస్తున్నాము. భూకంపం సంభవించిన దగ్గర నుండి మరి ఎక్కువగా నేపాల్ ప్రజల కొరకు ప్రార్ధిస్తూ ఉన్నాము. ప్రభువు చిత్తమైతే వెంటనే అక్కడకి వెళ్ళి వారిని పరామర్శించి, ప్రార్ధించి వారికి సహాయం చేయవలెనని ప్రభువుని ప్రార్ధించాము. ప్రభువు మా ప్రార్ధన ఆలకించి మే 15వ తారీఖున ఖాట్మాండు వెళ్ళుటకు ప్రభువు అవకాశం ఇచ్చాడు. అప్పటికి రెండు పెద్ద భూకంపములు సంభవించి ఉన్నవి. మొదటి భూకంపం సంభవించిన మూడు వారాలకే నేను నేపాల్ వెళ్ళటం జరిగింది. నేను నేపాల్ దేశం సందర్శించడం ఇది ఆరవ సారి. ఇది చాలా అందమైన దేశం. అయితే చాలామంది పేద ప్రజలు ఈ దేశంలో ఉన్నారు. మను ష్యులు చూచుటకు చిన్నవారైనా హృదయం చాలా పెద్దది. మే 15వ తారీకు శుక్రవారం మధ్యాహ్నము నేను ఖాట్మండు ఏయిర్పోర్ట్లో దిగాను. రన్వే అనేక చోట్ల రిపేరు చేయబడి ఉన్నది. ఏయిర్పోర్ట్ నిండా అనేక దేశాల మిలటరి వారు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు మరియు రెడ్క్రాస్ సొసైటి వారు ఉన్నారు. ఏయిర్పోర్ట్ బయట నా కొరకు నా స్నేహితుడు పాస్టర్ జేమ్స్ ఎదురు చూస్తూ ఉన్నాడు. నన్ను చూడగానే గట్టిగ కౌగిలించుకొని ఆనందపడ్డాడు. మేమిద్దరం కలిసి టాక్సీలో హోటల్కి బయలుదేరాము. ఖాట్మండులో రోడ్లన్ని నిర్మానుష్యంగా ఉన్నాయి. నేనడిగాను మనుష్యులు ఎక్కడ అని. అందరు భయపడి వారివారి గ్రామాలకు వెళ్ళిపోయారు. ఖాట్మండు ప్రపంచ టూరిస్టు

లకు నిలయం. వ్యాపారం ఏమి జరగటం లేదు. అందరు ముఖాలలో భయం, ఆందోళన. ఏప్పుడు ఏమి సంభవి స్తుందో తెలీదు. దాదాపు 25,00,000 మంది ఖాట్మండు విడచి వెళ్ళిపోయారు. నేపాల్ దేశములో శనివారము ప్రభుత్వ సెలవు దినము. గనుక అక్కడ శనివారమే విశ్వాసులు చర్చిలకు వెళ్తారు. శనివారం ఉదయాన్నే లేచి సంఘాన్ని దర్శించటానికి బయలుదేరాను. ఒక గంట ప్రయాణం ఉంటుంది. మొదట బక్తపూర్‌లో ఆగాను. హృదయ విదారకమైన దృశ్యాలు కనబడినవి. చాలా బాధ వేసింది. ఎక్కడ చూచిన బిల్డింగులు కూలిపోయి ఉన్నవి. మనుష్యులు టెంటులలో జీవిస్తున్నారు. అక్కడ నుండి నేను లలిత్‌పూర్ వెళ్ళాను. సంఘాన్ని దర్శించాను. దేవుని వాక్యాన్ని పంచుకున్నాను. నన్ను చూడగానే అందరు గట్టిగా చప్పట్లు కొట్టారు. అందరిని ప్రేమతో పలకరించి ప్రార్థించాను. దాదాపు ఎనభైమందికి పైగానే విశ్వాసులు చేరి ఉన్నారు. టెంటులలోనే ఆరాధన జరుపుకుంటున్నారు. అక్కడే నివాసం చేస్తున్నారు. ఎవరూ ఇళ్ళకు వెళ్ళడం లేదు. అక్కడే ఉంటు న్నారు. నా స్నేహితుల సహాయంతో తీసుకు వెళ్ళిన బియ్యాన్ని వారికి ఇయ్యడం జరిగింది. వారందరు ఎంతగానో సంతోషిం చారు. ప్రభువును స్తుతించారు. అక్కడ నుండి మేము మరి కొన్ని బియ్యపు బస్తాలు కొన్ని భక్తపూర్ అనే గ్రామానికి వెళ్ళటం జరిగింది. అది పూర్తిగా కొండల ప్రాంతము. దారి మధ్యలో అనేక ప్రాంతాలలో రోడ్లు పగిలిపోయి ఉండడం గమనించాను. భూకంపం యొక్క దృశ్యాలు భయంకరము. మేము భక్తపూర్ చేరుకునే సరికి 130 కుటుంబాలు మా కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఆ ప్రాంతమంతా విపరీత మైన వాసన. జంతువుల కళేబారాలు. మరియు భూకంపం మిగిల్చిన నష్టాలతో నిరాశతో ఉన్న మనుష్యులు నాకు కనబడ్డారు. మేము కొండ పై భాగానికి చేరుకున్నాము. అక్కడ చర్చి ఉంది. పాస్టర్‌గారు మరియు విశ్వాసులు మమ్ములను ఎదుర్కొని ట్రక్కులో నుండి బియ్యపు బస్తాలు మోసుకొని చర్చి దగ్గరకు చేరుకున్నాము. ప్రార్థన చేసి బియ్యం పంచాము. అన్ని మతాల వారు మా కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. అందరికి సమృద్ధిగా బియ్యం పంచాము. "ఒక వృద్ధురాలు నన్ను గట్టిగా పట్టుకొని ఏడ్చింది. రెండు చేతులు జోడించి. కన్నీరు నిండిన కళ్ళతోటి కృతజ్ఞతలు తెలిపింది". ఈ ట్రిప్పులో నేను మూడు విషయాలు నేర్చుకున్నాను. మొదటిది, మనుష్యులను యేసు వైపునకు చూపించుట, రెండవది, నిరీక్షణ సువార్తను అందించుట, మూడవది, యేసు ప్రేమని పంచిపెట్టుట. అవును ఈ మూడు విషయాలు ద్వారా యేసు నాతో గట్టిగా మాట్లాడాడు. తిరిగి హోటల్‌కి చేరుకున్నాను. నేను హోటల్ గదిలో కూర్చొని ఉన్నప్పుడు మరల భూకంపం వచ్చింది. ఈసారి 5.7 మాగ్నిట్యూడ్. నేను హోటల్ గది నుండి క్రిందకి వచ్చేసరికి హోటల్లో ఎవరు లేరు. ఎక్కడ చూచిన అరుపులు, మనుష్యుల పరుగులు. ఎవరిని కదిలిం చినా భయం, వేదన, ఆందోళన. ఎక్కడ చూసిన మీడియా వారు. ఇళ్ళలో, బిల్డింగులలో మనుష్యులు ఏవరు లేరు. అందరూ రోడ్ల పైనే. దగ్గర్లో ఇండియా ఎంబసి ఉంటే అక్కడకి వెళ్ళాను. కొన్ని విషయాలు తెలుసుకున్నాను. అదే సమయంలో ఉత్తర భారతదేశంలో పాట్నాలో భూమి కంపిం చిందని విన్నాను. నేను ప్రార్థించి ప్రభువుని అడిగాను. నన్ను క్షేమంగా ఇంటికి చేర్చుమని. మరల నా భార్య బిడ్డలను చూచుటకు అవకాశం ఇవ్వమని అడిగాను. ప్రభువు నాతో మాట్లడాడు. ధైర్యంగా ఉండుమని చెప్పాడు. నేను ఇండియాలో ఉన్న అక్క మాధురి మరియన్‌కు మరియు నా భార్య రిబ్కాకు ఫోన్ చేసి అక్కడి విషయాలు చెప్పి ప్రార్థించమన్నాను. రిబ్కాతో చెప్పాను ఎలాగైన ఒక విమానం టిక్కెట్ కొని ఈ-మెయిల్ చేయమన్నాను. తమ్ముడు పాస్టర్ పరాక్రం ఈ విషయంలో చాలా సహాయం చేశాడు. వారి సహాయం వలన నేను ఏయిర్ పోర్ట్ చేరుకోగలిగాను. అప్పటికి ఇండియా వెళ్ళవలసిన అన్ని విమానాలు వెళ్ళిపోయాయి.

**...మిగతా 22వ పేజిలో**



శ్రీమతి రిబ్కా విక్రాంత్

# వస్త్రములు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు.

ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన వస్త్రములను గూర్చి తెలుసుకుందాము.

ఉపోద్ఘాతము : బైబిలులో అనేక రకములైన వస్త్రములను గూర్చి పేర్కొనబడెను. వస్త్రములను ధర్మశాస్త్ర లేక చారిత్రక ప్రాధాన్యతవలన విభిన్న వ్యక్తులు ధరించిరి.

1. ఆదాము హవ్వలు తమ దిగంబర శరీరములను కప్పు-కొనుటకు అంజూరపు ఆకులతో చేసికొనిన కచ్చదములు. ఆదికాండము 3:7.

2. దేవుడు ఆదాము, హవ్వలకొరకు చేయించి తొడిగిన చర్మపు చొక్కాయిలు. ఆదికాండము 3:21.

3. యాకోబు తన కుమారుడైన యోసేపుకు కుట్టించిన విచిత్రమైన నిలువుటంగీ. ఆది 37:3,31,32.

4. ఫరో రాజ సంరక్షక సేనాధిపతియైన పోతీఫరు భార్య యొద్ద యోసేపు విడిచిపెట్టి వచ్చిన వస్త్రము (ఐగుప్తులో అంగీ). ఆదికాండము 39:12.

5. ఇశ్రాయేలీయుల ప్రధానయాజకుని వస్త్రములు. నిర్గ 28:4-43;39:1-31. లేవీయ 8:7-9; 16:4.

6. మోషే అహరోను యొద్ద నుండి తీసుకొని అతని కుమారుడైన ఎలియాజరుకు తొడిగించిన వస్త్రములు.సంఖ్యా 20:28.

7. అకాను యెరికో పట్టణములో దొంగిలించిన ఒక మంచి షీనారు పై వస్త్రము.యెహోషువ 7:21.

8. బోయజు రూతుకు కప్పిన వస్త్రము. రూతు 3:9.

9. షిలోహులోగల దేవుని మందిరములోనున్న బాలుడైన సమూయేలుకు అతని తల్లి హన్నా ఇచ్చిన అంగీ. 1సమూయేలు 2:19.

10. యోనాతాను తన స్నేహితుడైన దావీదుతో నిబంధన చేసికొని ఇచ్చిన నడికట్టు వస్త్రము. 1 సమూయేలు 18:4.

11. దేవుని మందసమును దావీదు యెరూషలేముకు మోయుచున్నప్పుడు ధరించిన సన్నపు నారతో చేయబడిన వస్త్రములు. 1 దిన 15:27.

12. అమ్నోను తామారును చెరచిన తరువాత ఆమె చింపివేసిన వివిధ వర్ణములుగల చీర. 2సమూ 13:18,19.

13. సౌలు నిద్రించుచుండగా దావీదు కొసిన వస్త్రపు చెంగు. 1 సమూయేలు 24:11.

14. అహీయా యొక్క చింపివేయబడిన వస్త్రము ప్రవక్తయైన అహీయా తాను ధరించిన క్రొత్త వస్త్రము పంద్రెండు తునకలుగా చింపి యరోబాముకు పది తునకలు ఇచ్చెను. ఇశ్రాయేలు సామ్రాజ్యము కూడ రాబోవు దినములలో ఇదే విధముగా విడగొట్టబడునని సాదృశ్య రూపముగా అతడు ఈ పని చేసెను. 1 రాజులు 11:29-31.

15. రామోత్గిలాదు మీదికి యుద్ధమునకు పోవుచూ యూదా రాజైన యెహోషాపాతు బుద్ధిహీనతతో ధరించిన వస్త్రములు. 2 దిన. 18:29.

16. దేవుని సముఖములో నిలువబడియున్నప్పుడు ప్రధాన యాజకుడైన యెహోషువ ధరించియున్న 'మలిన

వస్త్రములు". జెకర్యా 3:3.

17. బాప్తిస్మమిచ్చు యోహాను వస్త్రములు. మత్తయి 3:4.

18. తప్పిపోయిన కుమారుడు తిరిగి రాగా అతని తండ్రి వానికి తొడిగించిన ప్రశస్త వస్త్రములు. లూకా 15:22.

19. పెండ్లి వస్త్రము. మత్తయి 22:11.

20. గెత్సేమనే యొద్ద ఒక పడుచువాడు పారిపోవుచూ విడిచిపెట్టిన నారబట్ట. మార్కు 14:51.

21. జాలరియైన పేతురు వస్త్రములు. యోహాను 21:7.

22. మన రక్షకుడైన యేసుక్రీస్తు ధరించిన వస్త్రములు

అ. బేత్లెహేములో పొత్తి గుడ్డలు. లూక 2:7,12.

ఆ. ఆయన భూలోక సంబంధమైన సేవ చేయుచున్నప్పుడు ధరించిన వస్త్రములు. మత్తయి 9:21; 14:36 17:2. యోహాను 13:4.

ఇ. కల్వరియొద్ద ధరించిన వస్త్రములు

1. సైనికులు ఆయన వస్త్రములు తీసికొని ఎఱ్ఱని మత్తయి 27:28.అంగీ తొడిగించిరి.యోహాను 19:2,5.

2. హేరోదు తన సైనికులతో కూడ ఆయనను తృణీకరించి, అపహసించి తొడిగించిన ప్రశస్త వస్త్రములులూకా 23:11.

3. ఆయనను సిలువవేసిన తరువాత సైనికులు చీట్లు వేసి పంచుకొనిన వస్త్రములు. మత్తయి 27:35.

4. నీకొదేము, అరిమతయియ యోసేపులు యేసు దేహమునకు చుట్టిన నార వస్త్రములు యోహాను 19:40.

ఈ. ఆయన యొక్క ప్రస్తుత కాల వస్త్రములు ప్రకటన 1:13.

ఉ. రెండవ రాకడ సమయములో ఆయన ధరించు వస్త్రములు యెషయా 63:1-3.

23. అపొస్తలుడైన పౌలు రోమా చెరసాలలో ఉన్నప్పుడు తిమోతికి తన రెండవ పత్రిక వ్రాసి త్రోయలో కర్పు నొద్దనుండి తెమ్మనిన వస్తువులు (వీటిలో అంగీ కలదు). 2 తిమోతి 4:13.

24. నీతి వస్త్రములు. ప్రకటన 19:7,8,14.

25. అనీతి వస్త్రములు. యెషయా 64:6.

26. శ్రమల కాలములో హతసాక్షులైన వారికి ఇయ్యబడిన తెల్లని వస్త్రములు. ప్రకటన 6:11; 7:9.

**20వ పేజీ తరువాయి....**

ఆఖరి విమానం స్పైస్ జెట్ ఉన్నది. అయితే సీట్లు లేవన్నారు. అయితే మరల ప్రార్ధించాను. నా భార్య రిబ్కా నా బిడ్డలు నా కొరకు ప్రార్ధిస్తున్నారు. దేవుడు మా ప్రార్ధన విన్నాడు నా కొరకు ఒక అద్భుతం చేశాడు. ఒక మిలటరి ఆఫీసర్ మరియు ఏయిర్‌పోర్ట్ సిబ్బంది వచ్చి నన్ను దగ్గర ఉండి ఏయిర్‌పోర్ట్ లోపలకు తీసుకొని వెళ్ళి సిబ్బంది మాత్రమే వెళ్ళే స్థలము లోనికి నన్ను తీసుకొని వెళ్ళి కూర్చుండబెట్టి. ఫార్మాలిటీస్ అన్ని వారే పూర్తి చేసి చివరిగా ఉన్న ఒకే ఒక్క సీటును నాకు కేటాయించారు. దేవునికి స్తోత్రం. హల్లెలూయా. మన దేవుడు ఎంత గొప్పవాడు. వారు నాకు కృతజ్ఞత తెలిపారు. కష్టకాలములో నేపాలి ప్రజలను పరామర్శించి సహాయం చేసినందుకు నాకు కృతజ్ఞతలు తెలిపారు. నేను పదే పదే అంటాను సేవ అనేది భారము. అది లేకుండా ఉంటే మనం సమయం డబ్బు వృధా చేస్తున్నట్టే. ఆ రాత్రి ఢిల్లి వచ్చి ఉదయాన్నే విజయవాడ చేరుకున్నాను. నన్ను ఎదుర్కోనటానికి నా భార్య రిబ్కా నా నలుగురు పిల్లలు రేచల్, జెస్సికా, పూజా, జోప్రీతమ్ వచ్చారు. వారిని చూడగానే నాకు దుఃఖం ఆగలేదు. కొద్దిసేపటి తర్వాత అందరం కారులో ప్రార్ధన చేసుకున్నాము. దేవునికి వందనాలు తెలియచేసుకున్నాము. అవును ఇది మిషనరి జీవితం, మిషనరి ప్రయాణం. నా కొరకు ప్రార్ధించిన ప్రతి ఒక్కరికి నా కుటుంబానికి ఒంగోలులో ఉన్న ఐ.ఇ.ఆర్.ఎఫ్ తల్లి సంఘానికి నా వందనాలు. మన దేవుడు గొప్పవాడు. ఎంతైన నమ్మదగిన వాడు. దేవుడు మిమ్మును దీవించును గాక. ఆమెన్.

**గమనిక**

**GNM మరియు B.Sc. Nursingలలో ఖాళీలు కలవు. మీ పిల్లలను చేర్చాలనుకొనే వారు వెంటనే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి మీ సీటు రిజర్వ్ చేసుకోండి**

**9676340371, 9704255416**

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

విద్యను అమ్ముతున్న కాలంలో విద్యాదానం చేస్తున్న

# I.E.R.F. మిషన్ విద్యా సంస్థలు

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపబడిన సంస్థ)

బీద బడుగు వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు గొప్ప సదవకాశం. త్వరపడండి. ఒంగోలు, క్లాపేట, 6వ లైను, కృపాదానంగారి వీధిలో ఉన్న I.E.R.F. సంస్థ గత 40 సంవత్సరాలుగా పేద బడుగువర్గాల అభ్యున్నతి కొరకు విద్యారంగంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి రెసిడెన్షియల్ స్కూల్‌తో సమానంగా విద్యను అందిస్తుంది. గత ఏడాది మా U.C.L.I. స్కూల్‌నందు 10వ తరగతిలో 90% ఉత్తీర్ణత. అంతమాత్రమే కాక ఈ సంస్థలో చదివిన వారికి దైవానుగ్రహం కూడా మెండుగా లభిస్తుందని చెప్పుటానికి ఋజువు ఈ సంస్థలో చదివిన వారు అనేకులు విదేశాలలో (అమెరికాలో) ఉద్యోగం చేస్తూ ఉండటం గమనార్హం. ఈ విధంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతిని సాధిస్తున్న I.E.R.F. సంస్థ గత 2 సంవత్సరాలుగా 1,2,3 తరగతులకు ఉచితముగా కాన్వెంట్ స్థాయిలో ఇంగ్లీషు బోధన మొదలుపెట్టింది. టీచర్స్ ఇంగ్లీషు మాతృభాష అయిన ఇంగ్లండు దేశపు వారు కావటం ఇంకొక ప్రత్యేకత. మా స్కూలునందు ఎలిమెంటరీ పిల్లలు సైతం ఇంగ్లీషు మాట్లాడము గమనార్హం.

## మా స్కూలు ప్రత్యేకతలు

★ అన్ని తరగతుల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
★ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం మరియు ఒక జత యూనిఫాం ఉచితంగా ఇవ్వబడును.
★ విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా ఉచిత హాస్టల్ సౌకర్యం కలదు.
★ కులమత సంబంధం లేదు ఎవరైనా మా హాస్టల్‌లో చేరవచ్చును.
★ 1,2,3 తరగతులకు A/c Class Room సౌకర్యం కలదు.
★ ఎలిమెంటరీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం మరియు ఫ్యామిలీ సపోర్టు కలదు.
★ బాలికలకు ఉచితంగా G.N.M. నర్సింగ్, INTER శిక్షణ ఇప్పించబడును.
★ B.Sc. నర్సింగ్ వారికి స్వల్ప ఫీజులతో శిక్షణ.
★ 1 నుండి 10 వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. సీట్లు పరిమితం విచ్చేయండి.

సీట్లు పరిమితం కనుక ముందుగా సీటు రిజర్వ్ చేసుకొనవలెను.

మీ పిల్లల చక్కని భవిష్యత్ కొరకు ఉన్నత విద్యాబుద్ధుల కొరకు ఐ.ఈ.ఆర్.ఎఫ్. సంస్థలో చేర్పించండి.

ఇట్లు

**రెవ.డా॥ జోసఫ్ కొడవటికంటి,** కరస్పాండెంట్

సెల్ : 9676340371, 9704255416



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 9

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. యాకోబు ఐగుప్తులో ఎన్ని సంవత్సరాలు నివసించెను?
2. యాకోబు ఎన్ని సంవత్సరములు జీవించెను?
3. రాహేలుని ఎక్కడ పాతిపెట్టెనని యాకోబు యోసేపుతో చెప్పెను?
4. యాకోబు కుడి చేతిని ఎవరి మీద నుంచెను?
5. యాకోబు యోసేపుతో తనను ఎక్కడ పాతిపెట్టమని చెప్పెను?
6. యోసేపు ఎన్ని సంవత్సరములు జీవించెను?
7. హెబ్రీయుల మంత్రసానుల పేర్లేమి?
8. ఐగుప్తీయులు ఫరో యొక్క ధాన్యాదులను నిలువ చేయుటకు కట్టిన పట్టణములు ఏవి?
9. మోషే ఏ వంశమునకు చెందినవాడు?
10. ఫరోకి భయపడి మోషే ఏ దేశమునకు పారిపోయెను?
11. మిద్యాను దేశపు యాజకుని పేరేమిటి?
12. మిద్యాను దేశపు యాజకునికి ఎంతమంది కుమార్తెలు?
13. మోషే భార్య పేరు ఏమిటి?
14. మోషే కుమారుని పేరేమిటి?
15. గెర్షోము అంటే ఏమిటి?
16. మోషే మామ పేరు ఏమిటి?
17. మోషే మందను తోలుకొని ఏ పర్వతము దగ్గరికి చేరెను?
18. నేను ఎవడినని యెహోవా దేవుడు మోషేకి చెప్పెను?
19. ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి ఏ దేశానికి తీసుకు వెళతానని యెహోవా దేవుడు మోషేతో చెప్పెను?
20. మోషే యొక్క అన్న పేరు ఏమిటి?
21. హెబ్రీయులు గడ్డికి మారుగా ఏమి కూర్చుకొనెను?
22. జ్యేష్ఠ కుమారుడైన రూబేను కుమారుల పేర్లు?
23. ఉజ్జీయేలు ఎవరి కుమారుడు?
24. మోషే, అహరోనుల తల్లిదండ్రుల పేర్లు ఏమిటి?
25. అమ్రాము ఎంతకాలము బ్రదికెను?

## బైబిల్ క్విజ్-8 జవాబులు

(1)మీరు ఈ దేశము గుట్టు తెలిసికొనుటకై వచ్చితిరి అని వారితో కఠినముగా మాటలాడెను (2) బెన్యామీను (3) షిమ్యోనును (4) ద్విభాషి (5)వెండిగిన్నె (6) బెయేర్షెబా (7) 66 మంది (8) గోషేనులో (9)130 సం॥లు (10) యాజకుల భూములను (11) పానదాయకుని (12) 2 సం॥లు (13) రెండు కలలు (14) ఆవులు, పద్నాలుగు (15) వెన్నులు (16) దేశమంతటి మీద అధికారిగా నియమించెను (17) జప్నత్పనేహు (18) ఆసెనతు (19) పోతీఫెర (20) మనష్షే (21) ఎఫ్రాయీము (22) ఏడు సంవత్సరములు (23) ముప్పది సంవత్సరములు (24) ఓను (25) పదిమంది

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.